RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | మంగళవారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:108 | ఏప్రిల్ 14, 2026 | వెల: రూ.3-00

లింగబత్తిని కృష్ణ
సీఎండీ & ఎడిటర్
9701923260


## టీజీ టెట్-2026 నోటిఫికేషన్ విడుదల

- జూన్ 15 నుంచి పరీక్షలు
- ఏప్రిల్ 15 నుంచి దరఖాస్తులు
- సీబీటీ విధానంలో నిర్వహణ

2లో

## 'ఆర్‌టీఐ'పై స్పందించని డీపీవోకు నోటీసులు

విచారణకు హాజరు కావాలని సమాచార హక్కు కమిషనర్ ఆదేశం



2లో

## ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి సీఎం హామీ




- ఆదివాసీల సంక్షేమంపై దృష్టి
- మౌలిక వసతుల సమస్యల పరిష్కారం
- చెక్‌డ్యాంలు, ఇళ్ల కోటా పెంపు పరిశీలన

**వేద న్యూస్, హైదరాబాద్**

ఆదివాసీ, గిరిజన, ఏజెన్సీ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అడ్డంకిగా ఉన్న సమస్యలను ప్రత్యేకంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి దానసరి

మిగతా 2వ పేజీలో




2లో

# బీఆర్ఎస్ VS టీఆర్ఎస్

## వచ్చే ఎన్నికల్లో ఏ పేరుతో కారు పార్టీ బరిలోకి..?

## గులాబీ దళంలో 'పేరు' మార్పు ప్రకంపనలు

- 'తెలంగాణ' సెంటిమెంట్‌ను మళ్లీ అక్కున చేర్చుకుంటారా?
- మల్లగుల్లాలు పడుతున్న బీఆర్ఎస్ పెద్దలు
- తెలంగాణ ఆకాంక్షకు దూరం కావడమే శాపమైందా?
- పేరు మార్చి కొంపముంచుకున్న గులాబీ బాస్

### 'టీఆర్ఎస్' పేరు కలిసేలా కవిత కొత్త పార్టీకి ప్లాన్

- అదే నిజమైతే గులాబీ పార్టీకి భారీ దెబ్బ తప్పదంటున్న విశ్లేషకులు
- 'పాత పేరే ఆలోచిస్తున్నాం..' కేటీఆర్ హడావిడి ప్రకటనలు అందుకోసమేనా?
- అసలు కారు పార్టీలో అసలేం జరుగుతోంది?

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

రెండు దశాబ్దాల పాటు తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) అనే పేరుతో అప్రతిహత విజయాలను అందుకుని, రాష్ట్ర రాజకీయాలను శాసించిన గులాబీ దళం.. నేడు ఒక విచిత్రమైన ఆత్మ రక్షణలో పడింది.. జాతీయ రాజకీయాలనే మాయాలోకంలోకి వెళ్లాలన్న కాంక్షే ఆ పార్టీ కొంపముంచింది.. సరిగ్గా ఎన్నికల ముంగిట తెలంగాణ అనే అస్తిత్వాన్ని వదిలేసి భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)గా మారడం వల్ల జరిగిన నష్టం ఇప్పుడు పూడ్చలేనంతగా మారింది.. ఇన్నాళ్లూ బీఆర్ఎస్ పేరుపై గంభీరంగా ఉన్న గులాబీ బాసులు, ఇప్పుడు మళ్లీ టీఆర్ఎస్ నామస్మరణ చేయడమే రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా 'మళ్లీ టీఆర్ఎస్ పేరుపై ఆలోచిస్తున్నాం' అని ప్రకటించడం వెనుక కేవలం ఓటర్లను ఆకర్షించే ఎత్తుగడ ఉందా? లేక తన సోదరి కవిత 'టీఆర్ఎస్' పేరు కలిసేలా కొత్త పార్టీ పెట్టి అన్నకే చెక్ పెడుతుందన్న ఆందోళన దాగి ఉందా? తెలంగాణ సెంటిమెంట్‌ను తిరిగి సొంతం చేసుకోవడమే లక్ష్యంగా సాగుతున్న ఈ పేరు మార్పు వెనుక ఉన్న అసలు వ్యూహాలు, ఆసక్తికర పరిణామాలు, గులాబీ కుటుంబంలో సాగుతున్న అంతర్గత యుద్ధంపై 'వేద న్యూస్' ప్రత్యేక కథనం..

## మరణించిన కానిస్టేబుళ్ల పేరిట జీతాలు డ్రా?!

### నాలుగేళ్లుగా కొనసాగిన అక్రమ వ్యవహారం

- ఐడీలతో ప్రైవేట్ వ్యక్తుల పేర్లు యాడ్ చేసినట్లు అనుమానం
- డ్యూటీ ఎక్కడ చేశారన్న ప్రశ్నలకు సమాధానం లేని పరిస్థితి
- రికార్డులలో అటాచ్డ్ పోస్టింగ్‌లపై అనుమానాలు

2లో




## మక్క రైతుల ఇక్కట్లు

- కొనుగోలు లేక అన్నదాత గగ్గోలు
- కల్లాల్లో పంటను ఆరబోసి కొనుగోళ్ల కోసం ఎదురుచూపులు
- ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేపట్టాలని కర్షకుల వేడుకోలు

2లో





## మా భూ హక్కులు కోల్పోయాం

### ఇతరుల పేర్లపై పట్టాలు నమోదయ్యాయి

- ఉసిరికాయలపల్లి జీపీలో భూమి వివాదం
- న్యాయం చేయాలని అధికారులను ఆశ్రయించిన కుటుంబం

**వేద న్యూస్, కారేపల్లి**

మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీలో భూమి వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీస్తోంది. గ్రామానికి చెందిన కుర్స మల్లయ్య, ఆయన కుమారుడు కుర్స రాములు తమకు చెందిన భూమిపై హక్కులు కోల్పోయామని ఆరోపిస్తూ న్యాయం కోసం అధికారులను ఆశ్రయిస్తున్నారు. వివరాల ప్రకారం.. సర్వే నంబర్

మిగతా 2వ పేజీలో

వేద న్యూస్

మంగళవారం | ఏప్రిల్ 14, 2026

# దిక్సూచి.. అంబేద్కర్



దేశమంతా మత్తునిద్రలో ఉంటే నా దేశం నా ప్రజలు, నా ప్రజల భవిష్యత్తు అని, అహర్నిశలు నిద్రహారాలు మాని అలుపెరుగని పోరాటం చేసిన మహానుభావుడాయన..

బానిసత్వ సంకెళ్ల నుంచి విముక్తి కలిగించి మీ బానిసత్వాన్ని మీరే పోగొట్టుకోవాలి అని సమస్యలకు, సంఘర్షణలకు బెదరకుండా దేశ ప్రగతి కోసం పోరాడాలని సమస్త దేశ ప్రజలను జాగృతం చేసిన మార్గదర్శకుడాయన..

సోదరభావాన్నీ సమానత్వాన్ని పెంపొందించి కులాల పేరుతో కొట్టుకుంటే ఏమీ సాధించలేరని మనదంతా ఒకే జాతి అని అదే మానవజాతి అని ప్రజలను చైతన్యపరచిన ఘనుడాయన..

ప్రశ్నించేతత్వం, పోరాడే తత్వం లేనిచోట బానిసత్వం కొనసాగుతుందని పౌరుల నైతికాభివృద్దే దేశ అభివృద్ధి అని అంధకారపు చీకట్లను తొలగించిన జ్ఞానజ్యోతి ఆయన..

కేవలం భారతావని మాత్రమే కాకుండా యావత్తు ప్రపంచం నీకు జేజేలు పలుకుతోంది..

**అంబేద్కరా.. తరతరాలకు చెరగని దిక్సూచివి నీవయ్యా..**



లింగబత్తిని కృష్ణ
సీనియర్ జర్నలిస్ట్
9701923260

## 'ఆర్‌టీఐ'పై స్పందించని డీపీవోకు నోటీసులు

### విచారణకు హాజరు కావాలని సమాచార హక్కు కమిషనర్ ఆదేశం

**వేద న్యూస్, కొడిమ్యాల:** సమాచార హక్కు చట్టం కింద అడిగిన సమాచారాన్ని సమయానికి అందించకపోవడంతో జగిత్యాల జిల్లా పంచాయతీ అధికారికి రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్ నోటీసులు జారీ చేశారు. కొడిమ్యాల మండలానికి చెందిన కొండూరి కొండయ్య గ్రామంలోని అక్రమ నిర్మాణంపై పలుమార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఈ విషయంపై డీపీవోకు కూడా ఫిర్యాదు చేసినా స్పందన రాకపోవడంతో ఆర్‌టీఐ ద్వారా సమాచారం కోరినట్లు తెలిపారు. 45 రోజులు గడిచినా సమాచారం ఇవ్వకపోవడంతో సెక్షన్ 19(1) కింద అప్పీల్ చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఫిర్యాదును పరిశీలించిన కమిషనర్, ఏప్రిల్ 15న హైదరాబాద్‌లోని కార్యాలయంలో పూర్తి వివరాలతో హాజరుకావాలని ఆదేశిస్తూ జిల్లా పంచాయతీ అధికారికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

## మరణించిన కానిస్టేబుళ్ల పేరిట జీతాల డ్రా!

### నాలుగేళ్లుగా కొనసాగిన అక్రమ వ్యవహారం

**వేద న్యూస్, కరీంనగర్**

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మరణించిన ముగ్గురు కానిస్టేబుళ్ల పేరిట వేతనాలు డ్రా చేసిన వ్యవహారం రోజురోజుకీ కొత్త మలుపులు తిరుగుతోంది. దాదాపు నాలుగేళ్లుగా చనిపోయిన పోలీసుల జీతాలు డ్రా చేస్తున్న విషయం వెలుగులోకి రావడంతో సంచలనం రేపుతోంది. సాధారణంగా పోలీసు విభాగంలో బదిలీలు, అటాచ్డ్ డ్యూటీలకు సంబంధించిన ప్రక్రియలు ఉన్నతాధికారుల అనుమతులతో జరుగుతాయి. అటాచ్డ్ పోస్టింగ్‌లో ఉన్న సిబ్బంది పని చేస్తున్న చోట అధికారి ధృవీకరణ అనంతరం మాత్రమే వేతనాల బిల్లులు రూపొందించాలి. అయితే ఈ కేసులో అలాంటి ప్రక్రియలు పాటించబడ్డాయా అన్నదానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరణించిన కానిస్టేబుళ్లు సిహెచ్ రవిందర్, కె గంగస్వామి, కె రవిల ఐడీలను ఉపయోగించి ఐఎఫ్‌ఎంఐఎస్ పోర్టల్‌లో ప్రైవేట్ వ్యక్తుల పేర్లు నమోదు చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు సమాచారం. అయితే వారు ఎక్కడ విధులు నిర్వహించినట్లు చూపించి బిల్లులు తయారు చేశారన్నది ఇప్పటికీ స్పష్టతకు రాలేదు. అటాచ్డ్ డ్యూటీ పేరుతో ఎవరైనా అధికారులు ధృవీకరణ ఇచ్చారా? లేక సీపీవో కార్యాలయం స్థాయిలోనే నకిలీ పత్రాలు సృష్టించారా? అన్న కోణాల్లో విచారణ కొనసాగుతోంది. ఈ వ్యవహారంలో మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.

## మా భూ హక్కులు కోల్పోయాం

మొదటి పేజీ తరువాయి

548/98/2లో ఉన్న గంగాల భూమి తమదేనని వారు పేర్కొంటున్నారు. జీవనోపాధి కోసం కొంతకాలం గ్రామాన్ని విడిచి వెళ్లి తిరిగి వచ్చేసరికి, తమ భూమి పట్టా ఇతరుల పేర్లపై నమోదైందని గుర్తించి షాక్‌కు గురయ్యామని బాధితులు తెలిపారు. ఇల్లు కాలిపోవడంతో ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో గ్రామాన్ని వదిలి వెళ్లాల్సి వచ్చిందని, ఆ విషయం గ్రామస్థులకు కూడా తెలిసినదేనని వారు చెబుతున్నారు. తమ గైర్హాజరీని ఆసరాగా చేసుకుని కొందరు వ్యక్తులు అక్రమంగా భూమిపై హక్కులు సాధించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఇప్పటికే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమ వద్ద ఉన్న పత్రాలు, ఆధారాలు భూమి తమదేనని స్పష్టంగా నిరూపిస్తాయని పేర్కొంటూ, అధికారులు సమగ్రంగా విచారణ చేసి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. సమస్య పరిష్కారం కాకపోతే కుటుంబంతో కలిసి తీవ్ర నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేయడం గమనార్హం. ఈ భూమి వివాదంపై సంబంధిత రెవెన్యూ, పోలీస్ శాఖలు తక్షణమే స్పందించి నిజానిజాలు వెలికితీసి బాధితులకు న్యాయం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. భూమి కోల్పోతే జీవితం కోల్పోయినట్టే అని బాధితులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

## ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి సీఎం హామీ

మొదటి పేజీ తరువాయి

అనసూయ (సీతక్క) నేతృత్వంలో ఆదివాసీ, గిరిజన ఎమ్మెల్యేల బృందం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రిని కలిసి ఏజెన్సీ ప్రాంతాల సమస్యలపై వినతి పత్రం సమర్పించింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, గిరిజనుల సంక్షేమం ప్రభుత్వానికి ప్రాధాన్య అంశమని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో చెక్‌డ్యాంల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. వీటి ద్వారా తాగునీరు, సాగునీటి అవసరాలు తీరేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే చెక్‌డ్యాంలు, రహదారుల నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు త్వరగా వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గిరిజన రైతులు సాగు చేస్తున్న భూముల్లో బోర్లు వేసేందుకు అనుమతులు ఇవ్వాలన్న విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించారు. రహదారుల నిర్మాణం, మరమ్మత్తులకు అటవీ శాఖ నుంచి వస్తున్న అడ్డంకులను తొలగించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోటా పెంపు విషయాన్ని పరిశీలిస్తామని సీఎం పేర్కొన్నారు.




# గులాబీ దళంలో 'పేరు' మార్పు ప్రకంపనలు

- 'తెలంగాణ' సెంటిమెంట్‌ను మళ్లీ అక్కున చేర్చుకుంటారా?
- మల్లగుల్లాలు పడుతున్న బీఆర్ఎస్ పెద్దలు
- తెలంగాణ ఆకాంక్షకు దూరం కావడమే శాపమైందా?
- పేరు మార్చి కొంపముంచుకున్న గులాబీ బాస్

## 'టీఆర్ఎస్' పేరు కలిసేలా కవిత కొత్త పార్టీకి ప్లాన్

- అదే నిజమైతే గులాబీ పార్టీకి భారీ దెబ్బ తప్పదంటున్న విశ్లేషకులు
- 'పాత పేరే ఆలోచిస్తున్నాం..' కేటీఆర్ హడావిడి ప్రకటనలు అందుకోసమేనా?
- అసలు కారు పార్టీలో అసలేం జరుగుతోంది?

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు 'టీఆర్ఎస్ వర్సెస్ బీఆర్ఎస్' చర్చ నడుస్తోంది. రెండు దశాబ్దాల పాటు తెలంగాణ గడ్డపై తిరుగులేని శక్తిగా వెలిగిన గులాబీ పార్టీ, జాతీయ రాజకీయాల ఆశతో తన పేరును మార్చుకుని నేడు అస్తిత్వ సంక్షోభంలో పడిందా? పేరు మార్పు నిర్ణయమే ఆ పార్టీ కొంపముంచిందా? ఇప్పుడు మళ్లీ పాత పేరుతోనే ప్రజల ముందుకు వెళ్లాలని భావిస్తోందా? వచ్చే ఎన్నికల్లో బలమైన శక్తిగా ఎదిగేందుకేనా? లేక కవిత తన తండ్రి వద్దుకున్న 'టీఆర్ఎస్' పేరుతో కలిసొచ్చే పేరుతో తన కొత్త పార్టీని స్థాపించాలనుకుంటున్నారా? ఈ పరిణామాల వెనుక ఉన్న అసలు కారణాలు ఏంటి?

2001లో కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్)ని స్థాపించినప్పుడు అది కేవలం ఒక రాజకీయ పార్టీ కాదు, ఒక ఆకాంక్ష. ఆ పేరులోనే తెలంగాణ ఉండటం వల్ల పల్లె జనం, మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు అందరూ ఆ పార్టీని తమ సొంత సంస్థగా భావించారు. 'గులాబీ జెండా – తెలంగాణ అజెండా' అనే నినాదం జనాల్లోకి బలంగా వెళ్లింది. పద్నాలుగేళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత స్వరాష్ట్ర సాధన సాధ్యమైందన్నా, ఆ తర్వాత వరుసగా రెండుసార్లు కేసీఆర్ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించారన్నా.. దానికి టీఆర్ఎస్ అనే బ్రాండ్ ఇమేజ్ ప్రధాన కారణం. సబ్బండ వర్ణాల నోళ్లలో నానిన ఆ పేరును తీసేయడం అంటే, ఒక బలమైన భావోద్వేగ పునాదిని కూల్చేయడమేనని ఇప్పుడు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### భారత్ రాజకీయాల భ్రమలో..

జాతీయ స్థాయిలో చక్రం తిప్పాలనే భారీ లక్ష్యంతో 2022 అక్టోబర్‌లో టీఆర్ఎస్‌ను భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)గా మార్చారు. అయితే, ఈ మార్పు ప్రజల్లోకి వెళ్లడంలో విఫలమైందనేది అక్షర సత్యం. తెలంగాణ సెంటిమెంట్‌ను బలంగా నమ్మిన ఓటర్లకు బీఆర్ఎస్ అనే పేరులో తమ ప్రాంతీయ మూలాలు కనిపించలేదు. ఫలితంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ పట్టు కోల్పోయింది. పేరులో తెలంగాణ లేకపోవడం వల్లే తాము అనాథలమయ్యామని ఉద్యమకారులు భావించారు. మనం మన తెలంగాణను వదిలేసి దేశం మీదకు వెళ్తే, ఇక్కడ మన పట్టు జారిపోదా? అన్న చర్చ అప్పట్లోనే సాగింది. ఇప్పుడు అదే నిజమైందని ఫలితాలు నిరూపించాయి.

### కేటీఆర్ వ్యాఖ్యల వెనుక మర్మమేంటి?

ఇటీవల మంచిర్యాల పర్యటనలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టించాయి. పార్టీ పేరును మళ్లీ టీఆర్ఎస్‌గా మార్చాలని కార్యకర్తల నుంచి ఒత్తిడి వస్తోంది.. దీనిపై పార్టీలో చర్చ జరుగుతోంది అని ఆయన పేర్కొనడం వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీ శ్రేణుల్లో పోయిన ఉత్సాహాన్ని తిరిగి తేవడం, మళ్లీ తెలంగాణ సెంటిమెంట్‌ను రగిల్చి, కాంగ్రెస్, బీజేపీలను ఎదుర్కోవడం. కానీ, ఈ నిర్ణయం వెనుక కుటుంబ అంతర్గత రాజకీయాలు కూడా ఉన్నాయనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

### వచ్చే ఎన్నికలే లక్ష్యం..

పార్టీ పేరు మార్చడం అనేది కేవలం బోర్డులు మార్చినంత సులభం కాదు. దీనికి కేంద్ర ఎన్నికల సంఘం వద్ద పెద్ద ప్రక్రియ ఉంటుంది. అయినప్పటికీ, వచ్చే ఎన్నికల్లో గెలవాలంటే తెలంగాణ అనే బ్రాండ్ కచ్చితంగా ఉండాలని పార్టీ పెద్దలు డిసైడ్ అయ్యారు. బీఆర్ఎస్ పేరుతో వెళ్తే జాతీయ పార్టీగా ముద్ర పడి, లోకల్ సమస్యలపై పట్టు కోల్పోతామనే భయం వారిని వెంటాడుతోంది. తెలంగాణ అస్తిత్వమే ఆయుధంగా మళ్లీ ప్రజల్లోకి వెళ్లాలని భావిస్తున్న కారు పార్టీకి, ఈ పేరు మార్పు ఎంతవరకు మైలేజ్ ఇస్తుందో చూడాలి. ఒకవేళ కవిత ఎఫెక్ట్ నిజమైతే, అది గులాబీ కుటుంబంలో మరిన్ని చిచ్చులకు దారి తీసే అవకాశం ఉంది. ఏది ఏమైనా, టీఆర్ఎస్ వర్సెస్ బీఆర్ఎస్ ఎపిసోడ్ రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులకు నాంది కానుంది.

### కవిత కొత్త పార్టీ ప్లాన్.. అన్నకు చెక్ పెట్టడానికేనా?

ప్రస్తుతం వినిపిస్తున్న అత్యంత ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. కేసీఆర్ తనయ కవిత తన తండ్రి వదిలేసిన టీఆర్ఎస్ పేరును మళ్లీ తెరపైకి తేవాలని ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. తన తండ్రి కష్టపడి నిర్మించిన ఆ బ్రాండ్‌ను వృథా పోనివ్వకూడదని, అవసరమైతే టీఆర్ఎస్ పేరుతోనే ఆమె కొత్త రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించవచ్చనే ప్రచారం సాగుతోంది. ఒకవేళ కవిత నిజంగానే టీఆర్ఎస్ పేరుతో ముందుకొస్తే, అది కారు పార్టీకి (బీఆర్ఎస్) కోలుకోలేని దెబ్బ అవుతుంది. ఓట్లు చీలిపోవడమే కాకుండా, అసలైన టీఆర్ఎస్ మాదే అని ఆమె వాదిస్తే క్యాడర్ మొత్తం ఆమె వైపు వెళ్లే ప్రమాదం ఉంది. ఈ ముప్పును పసిగట్టిన కేటీఆర్, ముందస్తు జాగ్రత్తగా తామే మళ్లీ టీఆర్ఎస్‌గా మారుతామని ప్రకటించి ఉండవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## మక్క రైతుల ఇక్కట్లు

- కొనుగోలు లేక అన్నదాత గగ్గోలు
- కల్లాల్లో పంటను ఆరబోసి కొనుగోళ్ల కోసం ఎదురుచూపులు
- ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేపట్టాలని కర్షకుల వేడుకోలు

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి**

హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల పరిధిలో మక్క రైతులు గగ్గోలు పెడుతున్నారు. కొనుగోలు లేకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మక్కల కొనుగోలు కేంద్రం మొట్టమొదటిగా ధర్మసాగర్ మండలం కేంద్రంలో ఏర్పాటు చేయడం హర్షించే విషయమని కానీ, ఇంత వరకు రైతుల నుంచి ధాన్యం సేకరించకపోవడం సరికాదని కర్షకులు చెబుతున్నారు. తమ పంటను కల్లాల్లో ఆరబోసి విక్రయానికి సిద్ధంగా ఉంచామని కానీ, సంబంధిత శాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఒకవేళ అకాల వర్షాలు వస్తే తమ పరిస్థితి ఏమిటంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రైతులు ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోవాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. క్వింటాకు ప్రభుత్వ మద్దతు ధర రూ.2,400 ఉండగా, ప్రైవేటు వ్యాపారులు రూ.1,700 నుంచి 1,800 మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఎకరాకు రూ.25 వేల నుంచి 30 వేల వరకు కర్షకులు నష్టపోతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను సకాలంలో సర్కారు కొనుగోలు కేంద్రాల ద్వారా వెంటనే కొంటే బాగుంటుందని ఈ సందర్భంగా రైతులు కోరుతున్నారు.



### సర్కారు నిబంధనలు సరళతరం చేయాలి



రాష్ట్ర సర్కారు ఎకరాకు 26 క్వింటాల వరకే మక్కలు కొంటామని పరిమితివిధించడం సరి కాదు. మానవతా దృష్టితో రైతును ఆదుకునే కోణంలో ఆలోచించిపరిమితిని 40 క్వింటాళ్ల వరకు పెంచాలి. అదే విధంగా వెంటనే కొనుగోలుచేపట్టాలి. తద్వారా రైతుకు నష్టం జరగదు. మక్క రైతులను ఆదుకునే విధంగాసర్కారు చర్యలు వెంటనే తీసుకోవాలి.

*-యువరాజు సంగెకారి, దేవునూరు రైతు*

### 'ప్రైవేటు' దళారుల వద్దకు రైతులు వెళ్లకమునుపే కొనుగోలు చేపట్టాలి

సర్కారు కొనుగోలు కేంద్రాల వద్ద మక్కల కొనుగోళ్లను వెంటనేచేపట్టాలి. అందుకు తగు చర్యలు తీసుకోవాలి. మక్కల కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు మద్దతు ధర చెల్లించి వెంటనే కొనుగోలు చేపట్టకపోతే, రైతులుప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించి నష్టపోయే అవకాశం ఉన్నది. ముఖ్యంగాసంబంధిత శాఖ వారు ఈ దిశగా చర్యలు తీసుకోవాలి. రైతును ఆదుకునేవిధంగా సర్కారు తగు చర్యలు తీసుకోవాలి.



*-హింగె భాస్కర్, తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి కరీంనగర్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు*

### కొర్రీలు సరికాదు..

ప్రభుత్వం నిర్ణయించిన దాని ప్రకారం.. ఎకరాకు 26 క్వింటాలు కాకుండా 40–45 క్వింటాల్‌కు పరిమితి పెంచాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఒక ఎకరానికి సామాన్యంగా 40 క్వింటాళ్ల వరకు మక్క పండుతోందని వెల్లడిస్తున్నారు. ప్రభుత్వం పెట్టే కొర్రీల వల్ల ఉదాహరణకు 5 ఎకరాలు ఉన్న రైతులకు 136 క్వింటాళ్లకు మాత్రమే అనుమతి కలిగి ఉంటారని, నిజానికి ఆయనకు పంట 200 క్వింటాళ్ల వరకు పండగా, 64 క్వింటాళ్లు అమ్మడానికి రైతుకు అవకాశం లేదని వాపోతున్నారు. ఆ 64 క్వింటాళ్ల మక్కలను మళ్ళీ ప్రైవేట్ దళారీలకు అమ్మక తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్కారు మానవతా దృష్టితో రైతును ఆదుకునే విధంగా నిబంధనలు సరళతరం చేయాలని కోరుతున్నారు. మండల పరిధిలోని గ్రామాలన్నింటికీ కలిపి ఒకే వేదికగా మండలకేంద్రం వద్ద కొనుగోలు చేపట్టకుండా, ఏ గ్రామానికి ఆ గ్రామంలో కొనుగోలు చేపడితే రైతాంగానికి, సదరు గ్రామ హమాలీలకు మేలు జరుగుతుందని వారు వెల్లడిస్తున్నారు.

## టీజీ టెట్ నోటిఫికేషన్ విడుదల

**వేద న్యూస్, హైదరాబాద్:** తెలంగాణలో ఉపాధ్యాయ వృత్తిని ఆశిస్తున్న అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. టీజీటెట్–జూన్ 2026 నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. ఈ పరీక్షలను జూన్ 15 నుంచి జూన్ 30 వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో నిర్వహించనున్నట్లు ప్రకటించింది. అర్హులైన అభ్యర్థులు ఏప్రిల్ 15 నుంచి ఏప్రిల్ 30 వరకు అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు సమర్పించుకోవాలని అధికారులు తెలిపారు. టీజీటెట్ చైర్‌పర్సన్ డాక్టర్ ఇ. నవీన్ నికోలస్ ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. విద్యా హక్కు చట్టం–2009 ప్రకారం ఉపాధ్యాయ నియామకాలకు టెట్ అర్హత తప్పనిసరి కావడంతో ఈ పరీక్షకు ప్రాధాన్యం పెరిగింది. డీఈడీ/డీఎల్ఎడ్, బీఈడీ, లాంగ్వేజ్ పండిట్ లేదా సమాన కోర్సులు పూర్తి చేసిన వారు, అలాగే చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. గతంలో టెట్ అర్హత సాధించిన వారు తమ స్కోర్ మెరుగుపరచుకునేందుకు మళ్లీ పరీక్ష రాయవచ్చు. పరీక్షను రెండు పేపర్లుగా నిర్వహిస్తారు. 1 నుంచి 5వ తరగతి బోధన కోసం పేపర్–I, 6 నుంచి 8వ తరగతులకు పేపర్–II నిర్వహిస్తారు.

వేద న్యూస్

మంగళవారం ఏప్రిల్ 14, 2026

## ఇంటర్ ఫలితాల్లో మెరిసిన శ్రీ చైతన్య విద్యార్థులు




**వేద న్యూస్, చొప్పదండి:**

ఇటీవల ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో పట్టణంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. వివిధ విభాగాల్లో ఉన్నత మార్కులు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకువచ్చారు. సీఈసీ విభాగంలో సిద్దిక 500 మార్కులకు గాను 478 మార్కులు సాధించింది. ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో సాత్విక 450, శరణ్య 448, దివ్యశ్రీ 430, సౌమ్య 418, అక్షయ 416, త్రివేణి 408, జశ్వన్య 406, సాహితి 404 మార్కులు సాధించారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో పూజ 1000 మార్కులకు గాను 968 మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. అంజలి 959, అక్షయ 955, శశివర్ధన్ 950, నితిక 928, బిందు 922, ఉజ్మా సుహాన 919, డి. శ్రీజ 909, డి. దీపిక 907 మార్కులు సాధించి ప్రతిభ చాటారు. విద్యార్థుల విజయాన్ని పురస్కరించుకుని కళాశాల యాజమాన్యం వారిని అభినందించి సన్మానించింది. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించింది. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ అమిరిశెట్టి రత్నాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ & డైరెక్టర్ గుండేటి వెంకటరమణ, డైరెక్టర్లు పంతగాని అనిల్, వెంగళ హరిప్రసాద్ తదితరులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన టెన్త్ పరీక్షలు

- బోయినిపల్లి మండలంలో సజావుగా నిర్వహణ



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో గత నెల మార్చి 13న ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు సోమవారంతో విజయవంతంగా ముగిశాయి. మార్చి 13 నుంచి ఏప్రిల్ 13 వరకు నిర్వహించిన ఈ పరీక్షలు ఎటువంటి అవాంతరాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో సాగాయి. పరీక్షలు సజావుగా జరిగేలా అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. మండలంలో బోయినిపల్లి, విలాసాగర్ ప్రాంతాల్లోని జిల్లా పరిషత్ పాఠశాలలను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. బోయినిపల్లి కేంద్రంలో ఆదర్శ పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల, కోరేం, స్థంభంపల్లి, బోయినిపల్లి మరియు ఒక ప్రైవేట్ పాఠశాలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాశారు. విలాసాగర్ కేంద్రంలో విలాసాగర్, వెంకట్రావుపల్లి, నర్సింగపూర్, కొదురుపాక పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. మొత్తంగా బోయినిపల్లి కేంద్రంలో 155 మంది, విలాసాగర్ కేంద్రంలో 88 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రమకాంత్ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. చివరి రోజు పరీక్షలు పూర్తి చేసిన విద్యార్థులు ఆనందంగా పరీక్షా కేంద్రాల నుండి వెళ్లడం గమనార్హం.

## రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం

- కిష్టంపేటలో వాహనదారులతో సమావేశం
- ట్రాఫిక్ నియమాలపై ప్రతిజ్ఞ చేయించిన పోలీసులు



**వేద న్యూస్, చందుర్తి:**

చందుర్తి మండలం కిష్టంపేట గ్రామంలో సబ్ ఇన్‌స్పెక్టర్ జిల్లెల్ల రమేష్ ఆధ్వర్యంలో సోమవారం రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ పోలీస్ గంగారాం మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. వాహనదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి సంవత్సరం రోడ్డు భద్రత వారోత్సవాలను నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన పెంపొందిస్తున్నామని తెలిపారు. వాహనం నడిపేటప్పుడు సీటుబెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ మరియు ఇతర పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించడం పూర్తిగా నిషేధమని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని పిలుపునిచ్చారు. అనంతరం వాహనదారులతో ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ సురక్షితంగా వాహనాలు నడుపుతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కిష్టంపేట సర్పంచ్ మొకానపెల్లి దేవరాజు, రుద్రంగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరీం, గ్రామస్తులు గంగుల పరమేష్, నారాయణ, రామకృష్ణ, నాగుల గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## అనంతపల్లిలో రోడ్డు భద్రతా వారోత్సవాలు

- సర్పంచ్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ కార్యక్రమం
- ట్రాఫిక్ నియమాలపై గ్రామస్థులకు అవగాహన

**వేద న్యూస్, చందుర్తి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం అనంతపల్లి గ్రామంలో రోడ్డు భద్రత వారోత్సవాలను సర్పంచ్ చిలుకబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. వాహనం నడిపేటప్పుడు సీటుబెల్ట్, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వేగ పరిమితిని పాటించాలని సూచించారు. డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం చేయకూడదని, మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు. రోడ్డు నిబంధనలు పాటించడం ద్వారా మన ప్రాణాలతో పాటు మనపై ఆధారపడిన కుటుంబ సభ్యుల భద్రత కూడా కాపాడబడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెరగడం చాలా అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శైలేంద్ర, సుజాత, అనిల్, వార్డ్ సభ్యులు ఐతం అంజయ్య, స్వర్గం కిరణ్, కంబాల లక్ష్మి, మాజీ సర్పంచ్ అంజయ్య, జువ్వాడి మధుసూదన్ రావు, బైరి శంకరయ్య, సలేంద్ర నవీన్, యశోద, కవిత, నీరజ, బుర్ర గంగవ్వ, సునీత, శంకరయ్య, బుధవ్వ తదితరులు పాల్గొన్నారు.

## చందుర్తి ప్రభుత్వ కాలేజీ ప్రభంజనం

- ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో విశిష్ట ప్రతిభ
- విద్యార్థులు, అధ్యాపకులను అభినందించిన ప్రిన్సిపాల్

**వేద న్యూస్, చందుర్తి:**

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో చందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి కళాశాలకు గౌరవం తీసుకువచ్చారు. ప్రథమ సంవత్సరంలో 100 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, అందులో 40 మంది ఉత్తీర్ణత సాధించి 40 శాతం ఉత్తీర్ణత నమోదు అయింది. ద్వితీయ సంవత్సరంలో 128 మంది పరీక్షలు రాయగా, 80 మంది ఉత్తీర్ణత సాధించి 63 శాతం ఫలితాన్ని నమోదు చేశారు.

**ద్వితీయ సంవత్సర టాపర్లు..**

శ్రీ హర్షిక (ఎంపీసీ) 962/1000, చంటి సిద్ధార్థ (ఎంపీసీ) 917/1000, బత్తుల సిరిచందన (బీపీసీ) 939 మార్కులు సాధించారు. జయ్యారపు వైష్ణవి (బీపీసీ) 814/1000, నాగ అజయ్ కుమార్ (సీఈసీ) 796/1000, మోత్కుపల్లి గౌతమి (సీఈసీ) 722 మార్కులు సాధించారు.

**ప్రథమ సంవత్సర టాపర్లు..**

శ్రీరామ్, శ్రీహిత (ఎంపీసీ) 463/470, బొల్లు వర్షిని (ఎంపీసీ) 348/470, బొజ్జ ప్రణీత (బీపీసీ) 388/440, మేకల హారిక (బీపీసీ) 326/440, గొల్లపెల్లి నిత్యశ్రీ (సీఈసీ) 383/500, సుద్దాల నేహ (సీఈసీ) 377/500 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి విద్యార్థులు మరియు అధ్యాపకులను అభినందించారు. తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులు నిరుత్సాహపడకుండా తమ లోపాలను సరిదిద్దుకుని రాబోయే సప్లిమెంటరీ పరీక్షలను ఒక అవకాశంగా తీసుకుని మరింత శ్రద్ధతో సిద్ధం కావాలని సూచించారు.

## హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

**వేద న్యూస్ , వరంగల్ టౌన్:**



రంగశాయిపేట, శంభునిపేట బస్తీ ఆధ్వర్యంలో మహంకాళి దేవాలయ ప్రాంగణంలో నేడు (మంగళవారం) సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తున్న హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమ్మేళన నిర్వహణ సమితి అధ్యక్షుడు కందికొండ మోహన్ పిలుపునిచ్చారు. సోమవారం రంగశాయిపేట మహంకాళి దేవాలయ ప్రాంగణం కమ్యూనిటీ భవనంలో హిందూ సమ్మేళన కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించే హిందూ సమ్మేళన కార్యక్రమానికి హిందువులు అధిక సంఖ్య లో పాల్గొని విజయవంతం చేయాలనీ అన్నారు. హిందువులను ఐక్యం చేయాలనే సంకల్పంతో, హిందుత్వ సమైక్యత వాదాన్ని చాటుతూ మన భారత దేశాన్ని విశ్వగురువుగా నిలపాలానే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా అధ్యాత్మిక గురువులు శ్రీ స్థిత ప్రజ్ఞానంద సరస్వతి, ముఖ్య వక్తగా అఖిలభారత వనవాసి కళ్యాణ పరిషత్ మార్గదర్శి పొన్నపల్లి వెంకట రామ సోమయాజులు, మహిళా వక్తగా విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు బోయినపల్లి రాధ పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సమ్మేళన కార్యక్రమానికి అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. రంగశాయిపేట, శంభునిపేట బస్తి హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ హిందూ సమ్మేళనానికి ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా భారీ ఎత్తున తరలిరావాలని, కార్యక్రమాన్నిష విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమ్మేళన సమితి బాధ్యులు మండల మొగిలి, శెంకేసి కిషోర్, పాకాల చక్రపాణి, దేవులపెల్లి శ్రీనాథ్, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

## దుద్దిళ్ల శ్రీపాదరావు చరిత్ర ప్రత్యేకం

- నిరాడంబరత, నిజాయితీకి ప్రతీక
- కొనియాడిన ఎర్రబెల్లి స్వర్ణ
- వర్ధంతి సందర్భంగా నివాళులు



**వేద న్యూస్, హైదరాబాద్:**

తెలుగు రాజకీయాల్లో దుద్దిళ్ల శ్రీపాదరావు స్థానం విశిష్టమని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పేర్కొన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా పనిచేసిన దుద్దిళ్ల శ్రీపాదరావు నిరాడంబరత, నిజాయితీకి నిలువుటద్దమని అన్నారు. మంథని నియోజకవర్గ అభివృద్ధికి ఆయన అంకితభావంతో సేవలందించారని గుర్తుచేశారు. సర్పంచ్ స్థాయి నుంచి శాసనసభాపతి స్థాయికి ఎదిగిన ఆయన వ్యక్తిత్వమే ప్రజలకు చేరువై, ఇప్పటికీ వారి హృదయాల్లో నిలిచిపోయిందని తెలిపారు. ఆయన సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు టి. కుమార్ రావు, కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## వేగం వద్దు.. నెమ్మదే ముద్దు..

- రామడుగు మండలంలో రోడ్డు భద్రత అవగాహన



**వేద న్యూస్, రామడుగు:**

రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం అజాగ్రత్తగా వాహనాలు నడపడం అని పోలీసులు తెలిపారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా రామడుగు మండలంలోని రామడుగు, వెదిర, గుండి, గోపాల్రావుపేట గ్రామాల్లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వంటి చర్యలు ప్రాణాంతకమని హెచ్చరించారు. ఇటువంటి నిర్లక్ష్యంతో విలువైన ప్రాణాలు కోల్పోయి కుటుంబాలు కష్టాల్లో పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరిగినప్పుడు కొందరు వీడియోలు, ఫోటోలు తీస్తూ సమయం వృథా చేస్తున్నారని, అలాంటి పరిస్థితుల్లో మానవతా దృక్పథంతో వెంటనే అంబులెన్స్‌కు సమాచారం అందించి బాధితులను ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో రాజేశ్వరి, ఎస్సై రాజు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు

వేద న్యూస్

మంగళవారం ఏప్రిల్ 14, 2026

# రోడ్డు ప్రమాదాల నివారణకు 'అరైవ్-అలైవ్'

- ఇబ్రహీంపట్నంలో అవగాహన కార్యక్రమం
- ట్రాఫిక్ నియమాలపై వాహనదారులతో ప్రతిజ్ఞ




**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**

ఇబ్రహీంపట్నం మండల పరిధిలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని అరైవ్-అలైవ్ కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు సబ్ ఇన్‌స్పెక్టర్ జి. నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై నవీన్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం డ్రైవర్ల నిర్లక్ష్యమేనని తెలిపారు. ర్యాష్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వాహనం నడపడం, సీటుబెల్ట్ ధరించకపోవడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించడం వంటి చర్యలు ప్రమాదాలకు దారి తీస్తున్నాయని వివరించారు. ప్రతి ఒక్కరూ తమ భద్రతతో పాటు కుటుంబ సభ్యుల భద్రత కోసం ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు, యువతతో రోడ్డు భద్రత నియమాలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ప్రమాద రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లూ కోట్స్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# క్రీడా స్ఫూర్తి కొనసాగించాలి

- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- స్తంభంపల్లిలో టోర్నమెంట్ ప్రారంభం
- విజేతలకు నగదు బహుమతులు



**వేద న్యూస్, బోయినపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం స్తంభంపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న కేసీఆర్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌ను మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా యువత క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులకు క్రికెట్ కిట్‌లు అందజేశారు. జిల్లాలోని 12 మండలాలు, 2 మున్సిపాలిటీల నుంచి జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. మండల స్థాయిలో విజేతకు రూ.50 వేలు, రన్నర్ జట్టుకు రూ.20 వేలు బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఈ నెల 10 నుంచి 17 వరకు మండల స్థాయి మ్యాచ్‌లు, 18 నుంచి 25 వరకు జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే ఈ టోర్నమెంట్ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం

- 'అరైవ్అలైవ్'లో భాగంగా గ్రామ సభలు
- ట్రాఫిక్ నియమాలపై ప్రజలకు చైతన్యం
- బాధ్యతతో ప్రవర్తిస్తేనే ప్రమాదాల నివారణ: ఎస్సై నరేష్ రెడ్డి



**వేద న్యూస్, చొప్పదండి:**

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా 'అరైవ్-అలైవ్' కార్యక్రమం కింద చొప్పదండి మండల పరిధిలోని 11 గ్రామాల్లో పోలీస్ శాఖ, గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ సభల ద్వారా ప్రజలు, యువతకు ట్రాఫిక్ నియమాలపై చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై నరేష్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బాధ్యతతో ప్రవర్తిస్తేనే రోడ్డు ప్రమాదాలను తగ్గించి సురక్షిత సమాజాన్ని నిర్మించవచ్చని అన్నారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ వంటి పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. ట్రిపుల్ రైడింగ్, మద్యం సేవించి డ్రైవింగ్, రాంగ్ రూట్ ప్రయాణం వంటి ప్రమాదకర చర్యలను నివారించాలని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని తల్లిదండ్రులకు సూచించారు. గ్రామాల వారీగా రోడ్ సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రజలతో రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్, సర్పంచులు, వార్డు సభ్యులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# 13వ వార్షిక బ్రహ్మోత్సవాల కరపత్రం విడుదల

- 19 నుంచి 22 వరకు వైభవంగా ఉత్సవాలు
- భక్తులు భారీగా పాల్గొనాలని కమిటీ విజ్ఞప్తి



**వేద న్యూస్, శాయంపేట:**

మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీ శివ మార్కండేయ స్వామి దేవాలయాల 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 19 నుంచి 22 వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ చైర్మన్ బాసని సూర్య ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని ఆదివారం విడుదల చేశారు. ఉత్సవాలు 19వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు అంకురార్పణతో ప్రారంభమవుతాయని తెలిపారు. 20వ తేదీ సోమవారం గణపతి పూజ, పుణ్యాహవాచనం, అగ్నిస్థాపన, ధ్వజారోహణం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 21వ తేదీ మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం, అలాగే పర్వతవర్ధిని సమేత శ్రీ శివ మార్కండేయ స్వామి కళ్యాణం నిర్వహించబడతాయని చెప్పారు. 22వ తేదీ బుధవారం సుదర్శన హోమం, చండీ హోమం, పూర్ణాహుతి, గజారోహణ ఉత్సవాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఈ ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతల ఉమా రవి పాల్, దేవాలయ అర్చకులు మార్త రాజకుమార్, భక్తులు ఉప్పుల రాజు, మార్త సుమన్, బాల్నే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం

- కమలాపూర్‌లో యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహణ



**వేద న్యూస్, కమలాపూర్:**

హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి కొలుగూరి రాము ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పరకాల బ్లడ్ బ్యాంక్ సహకారంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పబ్బు సతీష్, ఉప సర్పంచ్ పుల్ల శ్రీనివాస్ హాజరై స్వయంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ జయంతిని సామాజిక ప్రయోజనం కలిగించే విధంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. హంగామా కార్యక్రమాల కంటే సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయమని అన్నారు. యువత అంబేద్కర్ ఆలోచనలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ శ్రేయస్సుకు తోడ్పడే కార్యక్రమాల్లో ముందుండాలని సూచించారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరిని అభినందిస్తూ, భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమ నిర్వాహకుడు కొలుగూరి రాము మాట్లాడుతూ.. ఈ శిబిరానికి సహకరించిన ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, పరకాల బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, రక్తదాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్ల వినోద్ కుమార్, జిల్లా నాయకులు, గ్రామ పంచాయతీ సభ్యులు, యువకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది


- స్మార్ట్‌ఫోన్‌లతో సేవల మెరుగుదల
- పోషణ పక్వాడ కార్యక్రమానికి శ్రీకారం

**వేద న్యూస్, శాయంపేట:**



అంగన్వాడి కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. శాయంపేటలో రైతు వేదికలో నిర్వహించిన పోషణ పక్వాడ కార్యక్రమాన్ని ప్రారంభించి అంగన్వాడి టీచర్లకు స్మార్ట్‌ఫోన్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య వివరాలను డిజిటల్ విధానంలో నమోదు చేయడం ద్వారా సేవలు మరింత సమర్థవంతంగా అందుతాయని చెప్పారు. పోషణ పక్వాడ ద్వారా పౌష్టికాహారంపై అవగాహన పెంపుతో పాటు ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షిస్తామని తెలిపారు. ప్రతి నెల పిల్లల ఎత్తు, బరువులను నమోదు చేసి పోషణ లోపాలను ముందుగానే గుర్తించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో పణిచంద్ర, అధికారులు, అంగన్వాడి సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# దొంగతనం కేసులో ముగ్గురు అరెస్ట్



**వేద న్యూస్, కాజీపేట:**

రైల్లో దొంగతనం కేసును ఛేదించిన కాజీపేట ఆర్పీఎఫ్ పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. గత డిసెంబర్‌లో భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న బొమ్మెర వంశీకి చెందిన మొబైల్ ఫోన్‌ను దొంగిలించి, అతడిని తోసివేయడంతో తీవ్రంగా గాయపడ్డ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా సోమవారం కాజీపేట రైల్వే ప్లాట్‌ఫారంపై అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా, ఫోన్ మరియు బైక్ దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. నిందితులు అశోక్ సింగ్, పవన్ సింగ్, జ్ఞాన్ సింగ్‌లుగా గుర్తించారు. వీరి వద్ద నుంచి మొబైల్ ఫోన్, పల్సర్ 220 బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన వస్తువుల విలువ రూ.1.43 లక్షలుగా ఉందని పోలీసులు తెలిపారు. ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన ఎస్ఐ వినోద్, సిబ్బంది మరియు ఆర్పీఎఫ్ సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# అంబేద్కర్ జయంతి పోస్టర్ల ఆవిష్కరణ

- చొప్పదండి నియోజకవర్గంలో ఘనంగా కార్యక్రమం



**వేద న్యూస్, చొప్పదండి:**

రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాల సందర్భంగా చొప్పదండి నియోజకవర్గంలోని రామడుగు, గంగాధర, చొప్పదండి మండల కేంద్రాల్లో వాల్ పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. జయంతి వేడుకలను విజయవంతం చేయడానికి అధిక సంఖ్యలో అంబేద్కర్ వాదులు, దళిత, బహుజనులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఎలుక ఆంజనేయులు, మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య, జిల్లా అధ్యక్షుడు కాడే శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపై బాధ్యతాయుతంగా డ్రైవింగ్ చేయాలి




**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రజాపాలనప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో "'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు ఈ నెల 13వ తేదీ నుండి 18వ తేదీ వరకు హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల పరిధిలో నిర్వహించబడుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం హనుమకొండలోని కాళోజి కళాక్షేత్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా ఎంఎల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద, కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రోడ్డు భద్రత ప్రాముఖ్యతపై ప్రసంగిస్తూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, బాధ్యతాయుతంగా డ్రైవింగ్ చేయాలని సూచించారు. పోలీసుల కళాజాతా, తెలంగాణ సాంస్కృతిక సారథి, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు రోడ్డు భద్రతపై నిర్వహించిన సామూహిక కార్యక్రమాలు ఆకట్టుకోగా, ప్రజల్లో అవగాహన పెంచి కనువిప్పు కలిగించాయి. అంతకుముందు పోలీసు, రవాణా శాఖల ఆధ్వర్యంలో కాళోజి కళాక్షేత్రం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లలో రోడ్డు భద్రతపై ప్రదర్శించిన ఎగ్జిబిట్లను ఎమ్మెల్సీ, పోలీస్ కమిషనర్, జిల్లా కలెక్టర్లు సందర్శించి తిలకించారు. ఈ కార్యక్రమంలో డిసిపి లు ధార కవిత, అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, రవి, అదనపు డిసిపి ప్రభాకరరావు, పోలీస్, రవాణా, రెవెన్యూ శాఖ అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, సర్పంచులు, కళాశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# అయ్యో.. రైతన్నకు ఎంత నష్టం!

- షార్ట్ సర్క్యూట్‌తో మొక్కజొన్న చేను దగ్ధం
- కన్నీరు మున్నీరైన రైతులు
- పరిహారం ఇవ్వాలని వేడుకోలు



**వేద న్యూస్, నల్లబెల్లి:**

వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం మూడు చెక్కలపల్లి గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మొక్కజొన్న పంట దగ్ధమైంది. సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగి పొలాల్లో వేగంగా వ్యాపించడంతో పంట మొత్తం బూడిదైంది. గ్రామానికి చెందిన పలువురు రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంట మరో వారం రోజుల్లో కోతకు సిద్ధంగా ఉండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మంటలు అదుపు చేసేముందే పంట పూర్తిగా నాశనమైంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట నోటికాడికి వచ్చేసరికి దగ్ధమవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

# సామ్రాజ్యవాదుల దుశ్చర్యనే జలియన్‌వాలాబాగ్ దుర్ఘటన

- అమరవీరులకు ఘన నివాళులు
- ఎంసీపీఐ(యు) నేత మహమ్మద్ రాజా సాహెబ్

**వేద న్యూస్, నల్లబెల్లి:**

భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో జలియన్‌వాలాబాగ్ దుర్ఘటన మరపురాని ఘట్టమని, అది సామ్రాజ్యవాదుల దారుణానికి నిదర్శనమని ఎంసీపీఐ(యు) నర్సంపేట డివిజన్ కార్యదర్శి మహమ్మద్ రాజా సాహెబ్ అన్నారు. సోమవారం నల్లబెల్లి మండల కేంద్రంలో హనుమాన్ జంక్షన్ వద్ద పార్టీ ఆధ్వర్యంలో సామ్రాజ్యవాద వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జలియన్‌వాలాబాగ్ అమరవీరులకు నివాళులర్పిస్తూ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. 1919లో అమృతసర్‌లో శాంతియుతంగా సమావేశమైన నిరాయుధులపై జనరల్ డయ్యర్ కాల్పులు జరిపి వందలాది మందిని హతమార్చిన ఘటనను ఆయన గుర్తు చేశారు. ఈ ఘటనకు నిరసనగా రవీంద్రనాథ్ ఠాగూర్ తన 'నైట్‌హుడ్' బిరుదును తిరస్కరించిన విషయాన్ని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో కూడా సామ్రాజ్యవాద విధానాలు కొనసాగుతున్నాయని, ప్రజలు అవగాహనతో వాటికి వ్యతిరేకంగా పోరాటాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దామ సాంబయ్య, నూనె రాజేందర్, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.




# ఆర్టీజన్ల సమస్యలు పరిష్కరించాలి

- కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి
- టీఆర్‌పీ జిల్లా యూత్ అధ్యక్షుడు రవికుమార్



**వేద న్యూస్, వనపర్తి:**

విద్యుత్ ఆర్టిజన్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని టీఆర్‌పీ వనపర్తి జిల్లా యూత్ అధ్యక్షుడు జి. రవికుమార్ డిమాండ్ చేశారు. టీజీఎస్పీడీసీఎల్ వనపర్తి డివిజన్ కార్యాలయం ముందు ఆర్టిజన్ ఎంప్లాయిస్ జేఏసీ చేపట్టిన సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవో-11 అమలు చేసి, విద్యార్హతల ఆధారంగా ఆర్టిజన్లను ఉద్యోగులుగా మార్చాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను గుర్తించి కనీస వేతనాలు చెల్లించడంతో పాటు, వారిని శాశ్వత ఉద్యోగులుగా మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో 'జాగృతి' సత్తా

- రాష్ట్ర స్థాయి ర్యాంకులతో మెరిసిన విద్యార్థులు

**వేద న్యూస్, వనపర్తి:**

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో జాగృతి కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులతో మరోసారి సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరం బైపీసీ విభాగంలో హెచ్. అనూష 994, ఎన్. అర్చన 993 మార్కులు సాధించగా, ఎంపీసీలో కె. అపూర్వ, త్యాగరాజు 992, ఇందు 991, లావణ్య 990 మార్కులు సాధించారు. ఎంఈసీ, సీఈసీ విభాగాల్లో కూడా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. ప్రథమ సంవత్సరంలో బైపీసీ విభాగానికి చెందిన ఉజ్మా హజారా 438 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించగా, ఎంపీసీ, ఇతర విభాగాల్లోనూ పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సీఈసీ విభాగంలో ప్రణిత, శ్రావణి ఉమ్మడి జిల్లా టాపర్లుగా నిలిచారు. విజయం సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ డా. అంబటి వినోద్ కుమార్ మరియు యాజమాన్యం సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా యాజమాన్యం మాట్లాడుతూ జాగృతి కళాశాల విద్యార్థులు నిరంతరం ఉత్తమ ఫలితాలు సాధిస్తూ జిల్లాలో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారని తెలిపారు.



# బోరు నీళ్ల వివాదం వేడెక్కింది

- ఆరోపణలను ఖండించిన సర్పంచ్
- తాగునీటి సమస్యపై గ్రామస్తుల ఆవేదన

**వేద న్యూస్, కారేపల్లి:**

సింగరేణి మండలంలోని భజ్యతండ, బొక్కల తండా గ్రామాల్లో బోరు నీళ్లపై వివాదం చర్చనీయాంశమైంది. బోరు నీళ్లు అమ్ముతున్నారనే ఆరోపణలను సర్పంచ్ హనుమంతరావు ఖండిస్తూ అవి పూర్తిగా అసత్యమని తెలిపారు. తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా ఎంపీ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి అనుమతులు లభించాయి. అయితే తాగునీటి సమస్య పరిష్కారం కాకుండా అభివృద్ధి పనులు చేపడుతున్నారని గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల పనులకు నీళ్లు ఎక్కడి నుంచి తెచ్చుకోవాలి? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు అభివృద్ధి పనులు, మరోవైపు నీటి సమస్యతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. ఈ అంశంపై అధికారులు విచారణ జరిపి నిజానిజాలు వెలికితీయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# 'జై భీమ్ అంబేద్కర్' ఆవిష్కరించిన కలెక్టర్

- గాయకుడు మీసాల రామన్న సన్మానం

**వేద న్యూస్, వనపర్తి:**

డా. బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా 'జై భీమ్ అంబేద్కర్' పాటను వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ విషయాన్ని అక్షయ్ రికార్డింగ్ స్టూడియో అధినేత, బహుజన గాయకుడు మీసాల రామన్న తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను మీసాల రామన్న శాలువాతో సన్మానించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈ పాట ఆవిష్కరణ జరగడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ గంధం నాగరాజు, రచయిత చీర్ల నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు భద్రతపై అవగాహనా కార్యక్రమం

- ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీసుల సూచన

**వేద న్యూస్, కారేపల్లి:**

భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీలో నిర్వహించిన 'క్షేమంగా వెళ్లి.. క్షేమంగా రండి' రోడ్డు భద్రత అవగాహన సదస్సు ప్రజల్లో చైతన్యం నింపింది. ఈ కార్యక్రమాన్ని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ బైరు గోపి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నిర్లక్ష్యం వల్లనే జరుగుతున్నాయని, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం తప్పనిసరి అని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు. ఎంపీడీఓ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు అవసరమని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు భీముడు నాయక్ కూడా యువత జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో సీవీ రామన్ సత్తా

- 900 పైగా మార్కులతో 133 మంది విద్యార్థులు
- జిల్లా స్థాయిలో రికార్డు ఫలితాలు

**వేద న్యూస్, వనపర్తి:**

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో సి.వి. రామన్ జూనియర్ కళాశాల విద్యార్థులు మరోసారి అద్భుత ఫలితాలు సాధించారు. అన్ని గ్రూపుల్లో విద్యార్థులు ప్రతిభ కనబరుస్తూ కళాశాలకు మంచి పేరు తీసుకొచ్చారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో 993 మార్కులు సాధించగా, పలువురు విద్యార్థులు 990కు పైగా మార్కులు సాధించారు. బైపీసీ, ఎంఈసీ, సీఈసీ విభాగాల్లో కూడా విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. మొత్తం 133 మంది విద్యార్థులు 900కు పైగా మార్కులు సాధించడం జిల్లా రికార్డుగా నిలిచింది. ప్రథమ సంవత్సరంలో కూడా పలువురు విద్యార్థులు ఉన్నత మార్కులు సాధించి కళాశాల ప్రతిష్ఠను పెంచారు. విజయం సాధించిన విద్యార్థులను కళాశాల యజమాన్యం, ప్రిన్సిపాల్ మరియు అధ్యాపక బృందం శాలువాలు, పూలబొకేలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా యాజమాన్యం మాట్లాడుతూ ప్రతి ఏడాది మంచి ఫలితాలు సాధించడం సి.వి. రామన్ ప్రత్యేకతగా నిలుస్తోందని పేర్కొన్నారు.

వేద న్యూస్

మంగళవారం ఏప్రిల్ 14, 2026

# మా భూ హక్కులు కోల్పోయాం..

- ఇతరుల పేర్లపై పట్టాలు నమోదైంది
- ఉసిరికాయలపల్లి జీపీలో భూమి వివాదం
- న్యాయం చేయాలని అధికారులను ఆశ్రయించిన కుటుంబం

**వేద న్యూస్, కారేపల్లి:**

మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీలో భూమి వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీస్తోంది. గ్రామానికి చెందిన కుర్స మల్లయ్య, ఆయన కుమారుడు కుర్స రాములు తమకు చెందిన భూమిపై హక్కులు కోల్పోయామని ఆరోపిస్తూ న్యాయం కోసం అధికారులను ఆశ్రయిస్తున్నారు. వివరాల ప్రకారం.. సర్వే నంబర్ 548/98/2లో ఉన్న గంగాల భూమి తమదేనని వారు పేర్కొంటున్నారు. జీవనోపాధి కోసం కొంతకాలం గ్రామాన్ని విడిచి వెళ్లి తిరిగి వచ్చేసరికి, తమ భూమి పట్టా ఇతరుల పేర్లపై నమోదైందని గుర్తించి షాక్‌కు గురయ్యామని బాధితులు తెలిపారు. ఇల్లు కాలిపోవడంతో ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో గ్రామాన్ని వదిలి వెళ్లాల్సి వచ్చిందని, ఆ విషయం గ్రామస్థులకు కూడా తెలిసినదేనని వారు చెబుతున్నారు. తమ గైర్హాజరీని ఆసరాగా చేసుకుని కొందరు వ్యక్తులు అక్రమంగా భూమిపై హక్కులు సాధించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఇప్పటికే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమ వద్ద ఉన్న పత్రాలు, ఆధారాలు భూమి తమదేనని స్పష్టంగా నిరూపిస్తాయని పేర్కొంటూ, అధికారులు సమగ్రంగా విచారణ చేసి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. సమస్య పరిష్కారం కాకపోతే కుటుంబంతో కలిసి తీవ్ర నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేయడం గమనార్హం. ఈ భూమి వివాదంపై సంబంధిత రెవెన్యూ, పోలీస్ శాఖలు తక్షణమే స్పందించి నిజానిజాలు వెలికితీసి బాధితులకు న్యాయం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. భూమి కోల్పోతే జీవితం కోల్పోయినట్టే అని బాధితులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

# జీరో మాతృ, శిశు మరణాలే లక్ష్యం

- హై రిస్క్ గర్భిణుల గుర్తింపు కీలకం
- పాఠశాలల్లో పోక్సో అవగాహనపై దృష్టి
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

జిల్లాలో జీరో మాతృ, శిశు మరణాల లక్ష్యంతో అన్ని శాఖలు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ మేరకు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి ప్రసవం సురక్షితంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా హై రిస్క్ గర్భిణీలను గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. వారం రోజుల్లోపు అలాంటి గర్భిణీలకు బర్త్ ప్లానింగ్ సిద్ధం చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లల ఆరోగ్య పరిస్థితులను గుర్తించి అవసరమైన చికిత్స అందించాలన్నారు. పాఠశాలల్లో పోక్సో చట్టంపై అవగాహన పెంచి, పిల్లల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. మాతృ, శిశు మరణాల ప్రతి ఘటనను విశ్లేషించి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామ స్థాయిలో ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది చురుకుగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో వైద్య, సంక్షేమ, విద్యా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇంటర్‌లో మెరిసిన విద్యార్థినులకు సన్మానం

**వేద న్యూస్, రుద్రూర్:**



ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన రుద్రూర్ మండలంలోని కస్తూరిబా గాంధీ పాఠశాల విద్యార్థినిలను సోమవారం గ్రామ సర్పంచ్ ఇందూర్ సునీత చంద్రశేఖర్ సన్మానించారు. విద్యార్థినులకు స్వీట్లు తినిపించి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాల లో చదువుతూ ఉన్నత మార్కులు సాధించడం గొప్ప విషయమని పేర్కొన్న సర్పంచ్, దీనికి కృషి చేసిన ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయురాలు శ్యామల, ఉప సర్పంచ్ నిస్సార్, వార్డు సభ్యులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# పోతంగల్‌లో చలివేంద్రం ఏర్పాటు

**వేద న్యూస్, పోతంగల్:**



పోతంగల్ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రయాణికులు, వాహనదారులకు తాగునీరు అందించేందుకు ఈ ఏర్పాట్లు చేసినట్లు సర్పంచ్ కల్లూరి సంధ్య హన్మండ్లు తెలిపారు. ఎండాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చలివేంద్రాన్ని ప్రారంభించామని, వేసవి ముగిసే వరకు కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నబి, కార్యదర్శి యాదవ్, సంతోష్ పటేల్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# యువకుడు అదృశ్యం.. కేసు నమోదు

**వేద న్యూస్, కోటగిరి:**



కోటగిరి మండల కేంద్రానికి చెందిన గోపి సాయిలు (30) అదృశ్యమైనట్లు ఎస్సై సునీల్ తెలిపారు. ఆయన భార్యతో కలిసి ఆర్మూర్‌లో నివసిస్తున్న గోపి సాయిలు, ఏప్రిల్ 12న కోటగిరికి వచ్చి రాత్రి తిరిగి ఆర్మూర్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన ఆయన తల్లి గోపి అనూష పోలీసులకు ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

# రైతుల సమస్యల ప్రజావాణిలో సర్పంచ్ గళం




- 11 కేవీ లైన్ తొలగింపుకు డిమాండ్
- సంయుక్త సర్వేకు అధికారుల నిర్ణయం

**వేద న్యూస్, కారేపల్లి:**

సింగరేణి మండల కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రైతుల సమస్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సర్పంచ్ సంఘం అధ్యక్షుడు భూక్యా రంజిత్ రైతుల తరపున సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మడంపల్లి, చర్లపల్లి, ఒడ్డుగూడెం, గాదెపాడు గ్రామాల రైతులు వ్యవసాయ భూముల మీదుగా వెళ్లే 11 కేవీ విద్యుత్ లైన్ వల్ల ఇబ్బందులు పడుతున్నారని, దాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై తహసీల్దార్, ఫారెస్ట్, విద్యుత్ శాఖల అధికారులు స్పందించి మంగళవారం సంయుక్త సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. సమస్య పరిష్కారానికి త్వరిత చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# గ్రానైట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం

- ముఖ్య అతిథిగా రాయల నాగేశ్వరరావు
- 500 మందికి ఉచిత వైద్య పరీక్షలు



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం గ్రానైట్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. రాష్ట్ర గిడ్డంగుల శాఖ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో హైదరాబాద్ యశోద వైద్య బృందం సేవలు అందించగా, వాసన్ ఐ కేర్, సాయి డెంటల్ కేర్ వైద్యులు పాల్గొన్నారు. వైద్యుల పర్యవేక్షణలో సుమారు 500 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. సంఘం సలహాదారు అదాలత్ నరేంద్ర సూచనల మేరకు ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బుర్ర మహేష్, గోపాల్ రావు, పరమేశ్వర్ రెడ్డి, వెంపటి వెంకటేశ్వర్లు, వెంపటి ఉపేందర్, నూనావత్ కిషన్, జానీ పాషా, ఆకుల సైదులు, నజీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# బాధితుడికి ఆర్థిక సహాయం

**వేద న్యూస్, పోతంగల్:**



పోతంగల్ మండలంలోని చేతన్ నగర్ గ్రామానికి చెందిన ఎర్రోళ్ల యోగాజి షుగర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స కోసం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న నాయకుడు హకీమ్ సోమవారం తన వంతుగా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట నాయకులు ఏజాజ్ ఖాన్, సునీల్, షేరు తదితరులు పాల్గొన్నారు.

# ఈ జాగ్రత్తలతో డయాబెటిస్‌కు చెక్

- ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజల కోసం..
- ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ ఊడుగుల సురేశ్

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి:**

గ్రామీణ భారతదేశంలో ముఖ్యంగా తెలంగాణ గ్రామీణ ప్రాంత ప్రజల జీవనశైలి, ఆహారపు అలవాట్లను దృష్టిలో ఉంచుకుని, షుగర్ (డయాబెటిస్) నియంత్రణ కోసం తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రముఖ వైద్య నిపుణులు, గోల్డ్ మెడలిస్ట్, ఎండీ, జనరల్ ఫిజీషియన్, ట్రస్టెడ్ డయాబెటాలజిస్ట్ డాక్టర్ ఊడుగుల సురేశ్ వివరించారు. అవేంటో మీరూ చదివి తెలుసుకోండి..ఈ నెల 11, 12 తేదీల్లో నాగార్జునసాగర్‌లో ‘ గ్రామీణ భారతదేశంలో మధుమేహ నిర్వహణ’పై జరిగిన రీసెర్చ్‌కు డాక్టర్ ఊడుగుల సురేశ్ హాజరయ్యారు. అన్నం విషయంలో జాగ్రత్తలు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన ఆహారం అన్నం. అయితే, తెల్లటి అన్నం (పాలిష్ పట్టిన బియ్యం) రక్తంలో చక్కెర స్థాయిని త్వరగా పెంచుతుంది. ఈ నేపథ్యంలో పరిమాణం తగ్గించండి. ప్లేటు నిండా అన్నం తినే అలవాటు మానుకుని, అన్నం పరిమాణాన్ని తగ్గించి కూరల పరిమాణాన్ని పెంచాలి. ముడి బియ్యం లేదా దంపుడు బియ్యం.. వీలైతే పాలిష్ తక్కువ చేసిన బియ్యం వాడటం మంచిది. ప్రత్యామ్నాయంగా.. జొన్నలు, సజ్జలు, రాగులు వంటి చిరుధాన్యాలను అన్నంలా వండుకుని తినడం వల్ల షుగర్ త్వరగా పెరగదు. ఆకుకూరలలో ముఖ్యంగా తోటకూర, పాలకూర, చుక్కకూర వంటి ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. వీటిలో పీచ పదార్థం అధికంగా ఉంటుంది. తీగ జాతి కూరగాయలలో పొట్లకాయ, బీరకాయ, సొరకాయ, బెండకాయ వంటివి

ఆరోగ్యానికి చాలా మంచివి. పప్పు ధాన్యాలను రోజూ తీసుకోవాలి. భోజనంలో కందిపప్పు, పెసరపప్పు లేదా శనగలు ఉండేలా చూసుకోవాలి. ఇవి ప్రోటీన్‌ను అందిస్తాయి. వేళకు భోజనం చేయాలి. ఉదయం అల్పాహారం తప్పనిసరిగా తీసుకోవాలి. రాత్రి భోజనం పడుకునే కనీసం 2-3 గంటల ముందే ముగించాలి. ఒకేసారి భారీగా తినడం కంటే, తక్కువ మొత్తంలో ఎక్కువ సార్లు తినడం మంచిదని పేర్కొన్నారు. టీ, కాఫీల్లో చక్కెర పూర్తిగా మానేయాలి. స్వీట్లు, సోడాలు, కూల్ డ్రింక్స్‌కు దూరంగా ఉండాలి.ఆలుగడ్డ (బంగాళదుంప), కందగడ్డ, పెండలం వంటి భూమి లోపల పండే దుంపలను తగ్గించాలి. నూనెలో వేయించిన వడలు, బజ్జీలు, సమోసాలు తగ్గించాలి. ఫ్రూట్స్ లో జామ పండు, బొప్పాయి, ఆపిల్ వంటివి పరిమితంగా తీసుకోవచ్చు. మామిడి, సీతాఫలం, అరటిపండు వంటి తీపి ఎక్కువ ఉన పండ్లను తగ్గించాలి. రోజుకు కనీసం 3-4 లీటర్ల నీరు తాగాలి. కేవలం ఆహారం మార్పులే కాకుండా, రోజూ కనీసం 30-40 నిమిషాల పాటు వేగంగా నడవడం వ్యాయామం) చాలా అవసరం అని చెప్పారు..




# మన ఇసుక వాహనం పోర్టల్‌పై సమీక్ష

**వేద న్యూస్ ఆదిలాబాద్ :**



కలెక్టరేట్ సమావేశ మందిరంలో “మన ఇసుక వాహనం” పోర్టల్‌పై అవగాహన కల్పిస్తూ జిల్లా కలెక్టర్ రాజర్షి షా సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇసుక రవాణా వ్యవస్థను పారదర్శకంగా అమలు చేయడంపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక రవాణాలో అక్రమాలను అరికట్టేందుకు పోర్టల్ వినియోగం కీలకమని తెలిపారు. ప్రతి వాహనం, డ్రైవర్, యజమాని వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని సూచించారు. పోర్టల్ ద్వారా జరిగే లావాదేవీలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశించారు. ఇసుక సరఫరా ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమయానికి ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. పోర్టల్ వినియోగంపై గ్రామస్థాయి వరకు అవగాహన కల్పించాలని, ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు నిబంధనలు పాటించాలని హెచ్చరించారు.

## ‘జెఫింగ్’ ట్రెండ్: పరుగు మధ్యలో

# నడకతో ఫిట్‌నెస్‌కు కొత్త దారి





**- ఊపిరి తేలికగా స్టామినా ఎక్కువగా - గాయాల ముప్పు తగ్గించే రన్‌వాక్ పద్ధతి**

**వేద న్యూస్ డెస్క్:**

కొద్దిదూరం పరుగెత్తగానే ఊపిరి అందకపోవడం, కండరాల నొప్పులు రావడం చాలా మందికి సహజమే. ఈ సమస్యలకు పరిష్కారంగా ఇప్పుడు ‘జెఫింగ్’ అనే సరికొత్త ఫిట్‌నెస్ విధానం ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతోంది. ఇది పరుగు మధ్యలో నియంత్రిత నడకను కలిపిన శిక్షణ పద్ధతి. దీని వల్ల స్టామినా పెరిగి, అలసట తగ్గి, గాయాల ప్రమాదం తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ పద్ధతిని ఒలింపిక్ స్థాయి రన్నర్ జెఫ్ గాలోవే ప్రాచుర్యంలోకి తీసుకువచ్చారు. నిర్ణీత సమయం పరుగెత్తి, ఆ తర్వాత కొద్దిసేపు చురుకుగా నడిచి మళ్లీ పరుగు మొదలుపెట్టడం ఈ విధానంలోని ముఖ్యాంశం. పరుగు మొదలుపెట్టిన వెంటనే ఇంటర్వెల్స్ పాటించడం వల్ల శరీరం అధిక ఒత్తిడికి గురికాకుండా క్రమంగా దూరం పెంచుకోవచ్చు. కొత్తగా ప్రారంభించే వారు 30 సెకన్లు పరుగు, 30 సెకన్లు నడకతో మొదలుపెట్టవచ్చు. మధ్యస్థ స్థాయి వారు మూడు నిమిషాల పరుగు తర్వాత ఒక నిమిషం నడకను అనుసరించవచ్చు. నడిచేటప్పుడు పూర్తిగా ఆగిపోకుండా, గుండె వేగం తగ్గకుండా చురుకుగా నడవడం అవసరం. స్నేహితులతో మాట్లాడగలిగేంత వేగంతోనే పరుగు కొనసాగించాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఈ పద్ధతి వల్ల కీళ్లు, కండరాలపై ఒత్తిడి తగ్గి, వ్యాయామం తర్వాత వచ్చే నొప్పులు తక్కువగా ఉంటాయి. కేలరీలు సమర్థవంతంగా దహనం అవడంతో బరువు తగ్గడంలో కూడా సహాయపడుతుంది. అనుభవజ్ఞులైన రన్నర్లు సైతం దీని ద్వారా సుదూర రేసులను వేగంగా పూర్తి చేస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. పరుగును భారంగా కాకుండా ఆనందంగా మార్చుకోవడానికి జెఫింగ్ మంచి మార్గమని నిపుణులు అంటున్నారు. ఆరోగ్యంగా ఉండటానికి కేవలం కష్టపడటమే కాదు, తెలివిగా వ్యాయామం చేయడం కూడా ముఖ్యమని ఈ పద్ధతి స్పష్టం చేస్తోంది.

# మెంతులు ఆరోగ్యానికి సహజ వరం

- నానబెట్టిన మెంతులతో శరీరానికి శక్తి - గుండె నుంచి హార్మోన్ల వరకు రక్షణ కవచం

**వేద న్యూస్ డెస్క్:**




మన వంటింట్లో సాధారణంగా పోపు దినుసుగా ఉపయోగించే మెంతులను కేవలం రుచికోసం మాత్రమే కాకుండా ఒక సూపర్ ఆహారంగా పరిగణించాల్సిన అవసరం ఉంది. మెంతుల్లో శరీరానికి అవసరమైన పీచు పదార్థం, ఇనుము, కాల్షియం, మెగ్నీషియం, విటమిన్ బి6తో పాటు శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరానికి సమగ్ర ఆరోగ్యాన్ని అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. రాత్రంతా మెంతి గింజలను నీటిలో నానబెట్టి, ఉదయం ఖాళీ కడుపుతో ఆ నీటిని తాగి గింజలను నమలడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. శాస్త్రీయ అధ్యయనాల ప్రకారం మెంతుల్లోని సాపోనిన్లు, ఫినోలిక్ సమ్మేళనాలు శరీరంలోని వాపును తగ్గించడంలో సహాయపడతాయి. ఈ విధంగా తీసుకోవడం వల్ల పోషకాలు నేరుగా రక్తంలోకి చేరి శరీరానికి త్వరిత ప్రయోజనం అందిస్తాయి. మెంతులు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడంలో సహాయపడతాయి. దీంతో ధమనులలో అడ్డంకులు తగ్గి గుండె ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే మెంతి నీరు గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం వంటి జీర్ణ సంబంధ సమస్యలను తగ్గిస్తుంది. ప్రేగులను శుభ్రంగా ఉంచి శరీరానికి తేలికను కలిగిస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో మెంతులు అద్భుతంగా పనిచేస్తాయి. జీవక్రియను వేగవంతం చేసి ఆకలిని తగ్గించి శరీరంలోని అదనపు కొవ్వును కరిగించడంలో సహాయపడతాయి. మహిళల ఆరోగ్యానికి మెంతులు ప్రత్యేకంగా మేలు చేస్తాయి. హార్మోన్ల సమతుల్యతను కాపాడి క్రమరహిత రుతుక్రమం, థైరాయిడ్, పీసీఓడీ వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. ఈస్ట్రోజెన్ స్థాయిలను సమతుల్యం చేయడం ద్వారా చర్మం యవ్వనంగా ఉండటానికి, జుట్టు బలంగా పెరగడానికి తోడ్పడతాయి. అయితే ఏ ఆహారాన్నైనా మితంగా తీసుకోవడం ముఖ్యం. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు వైద్యుల సలహాతో మెంతులను ఆహారంలో చేర్చుకోవడం ఉత్తమం.

# నిద్రతోనే రోగనిరోధక శక్తి బలోపేతం

**- సైటోకైన్లు పెరగాలంటే గాఢ నిద్ర అవసరం - టి-కణాల చురుకుదనానికి విశ్రాంతి కీలకం**

**వేద న్యూస్ డెస్క్:**

ఆరోగ్యకరమైన జీవనానికి నిద్ర ఎంతో ముఖ్యమని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా రోగనిరోధక శక్తి బలంగా ఉండాలంటే కంటి నిండా నిద్ర తప్పనిసరి. శరీరంలో సైటోకైన్లు అనే ప్రోటీన్లు వార్తాహరుల్లా పనిచేస్తూ రోగనిరోధక ప్రతిస్పందనను నియంత్రిస్తాయి. ఇంటర్ల్యూకీన్-1, ట్యూమర్ నెక్రోసిస్ ఫ్యాక్టర్ వంటి కొన్ని సైటోకైన్ల స్థాయులు నిద్ర సమయంలో పెరుగుతాయి. ఇవి వాపు ప్రక్రియను నియంత్రించడంలో, ఇన్ఫెక్షన్లతో పోరాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి. నిద్రలేమి ఉంటే వీటి ఉత్పత్తి తగ్గిపోవడంతో రోగనిరోధక వ్యవస్థ బలహీనపడే ప్రమాదం ఉంది. తెల్ల రక్తకణాల్లో ముఖ్యమైనవి టి-కణాలు. ఇవి శరీరాన్ని దాడి చేసే వైరస్లు, బ్యాక్టీరియాలను గుర్తించి వాటిని నిర్మూలించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. పరిశోధనల ప్రకారం, గాఢ నిద్ర టి-కణాల చురుకుదనాన్ని పెంచుతుంది. ఇన్ఫెక్షన్‌కు గురైన కణాలను వేగంగా గుర్తించి స్పందించే సామర్థ్యం నిద్రతో మెరుగుపడుతుంది. నిద్రలేమి కారణంగా ఈ ప్రతిస్పందన మందగించి జబ్బులు త్వరగా సోకే అవకాశం ఉంటుంది.



అలాగే యాంటీబాడీలు శరీరాన్ని రోగకారక క్రిముల నుంచి రక్షించే ఆయుధాల్లాంటివి. వీటి సరైన ఉత్పత్తికి కూడా నిద్ర అవసరం. సరిపడా నిద్రపోతే శరీరం భవిష్యత్తులో వచ్చే ఇన్ఫెక్షన్లను ఎదుర్కొనేలా సిద్ధంగా ఉంటుంది. అందుకే రాత్రిళ్లు అర్ధరాత్రి వరకు టీవీ, మొబైల్ వినియోగం తగ్గించి త్వరగా నిద్రపోవడం మంచిది. పెద్దవారికి రోజుకు సాధారణంగా 7 నుంచి 9 గంటల నిద్ర అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. అయితే అతిగా 9-10 గంటలకు మించి నిద్రపోవడం కూడా ఆరోగ్యకరం కాదు. ఎక్కువసేపు పడుకున్నప్పటికీ అలసటగా అనిపిస్తే గాఢనిద్ర లోపించిందనే సూచన కావచ్చు. కాబట్టి సమయానికి నిద్రపోయి, సమయానికి లేవడం అలవాటు చేసుకుంటే రోగనిరోధక శక్తి బలపడటంతో పాటు ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

# కంటి నొప్పి: నిర్లక్ష్యం చేస్తే ప్రమాదమే



**- కంటిదా? మెదడుదా? లక్షణాలు గుర్తించడం ముఖ్యం**
**- ప్రమాద సంకేతాలు కనిపిస్తే వెంటనే పరీక్షలు అవసరం**

**వేద న్యూస్ డెస్క్:**

కంటి నొప్పి సాధారణంగా అలసట, ఇన్ఫెక్షన్లు, గాయాలు లేదా ఎక్కువసేపు మొబైల్, టీవీ వాడకం వల్ల వస్తుంది. అయితే ఈ నొప్పి కంటికి సంబంధించినదా లేక మెదడుకు సంబంధించినదా అన్నది గుర్తించడం చాలా ముఖ్యం. చాలా మంది దీనిని సాధారణ తలనొప్పిగా భావించి నిర్లక్ష్యం చేస్తారు. కానీ కొన్ని సందర్భాల్లో ఇది తీవ్రమైన సమస్యకు సంకేతం కావచ్చు. ఆరోగ్య నిపుణుల ప్రకారం కంటి నొప్పి ఒక్కటే ఉంటే అది మెదడు సమస్య కావడం చాలా అరుదు. కానీ కంటి నొప్పితో పాటు నుదిటి నుంచి మెడ వరకు తీవ్రమైన తలనొప్పి, తరచూ తల తిరగడం, శరీరంలోని ఏదైనా భాగంలో తిమ్మిరి, పదేపదే వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ఇవి మెదడులో వాపు, కణితి వంటి సమస్యలకు సంకేతాలు కావచ్చు. కంటి నొప్పిని నివారించడానికి కొన్ని సాధారణ జాగ్రత్తలు పాటించాలి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి కంటి పరీక్ష చేయించుకోవడం మంచిది. మొబైల్ ఫోన్, టీవీ విటమిన్ ఏ, సి, ఈ వంటి పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవాలి. కళ్లకు తగినంత విశ్రాంతి ఇవ్వడం చాలా ముఖ్యం. కంటి నొప్పి చిన్న సమస్యగా కనిపించినా, అది ఎక్కువకాలం కొనసాగితే లేదా తీవ్రమైతే నిర్లక్ష్యం చేయకూడదు. సమయానికి పరీక్షలు చేయించుకుంటే తీవ్రమైన సమస్యలను ముందుగానే గుర్తించి చికిత్స పొందవచ్చు. సరైన జీవనశైలి, కంటి సంరక్షణతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

## శాకాహారులకు ప్రొటీన్ ఆందోళన అవసరమా?




**వేద న్యూస్ డెస్క్:**


ప్రొటీన్ విషయంలో శాకాహారులు చాలాసార్లు ఆందోళన చెందుతుంటారు. తగినంత ప్రొటీన్ అందడం లేదేమోనని భావించి ప్రొటీన్ పొడులు వాడాలా అనే సందేహం కలుగుతుంది. అయితే నిపుణుల ప్రకారం, ఆహారం ద్వారానే ప్రొటీన్ పొందడం ఉత్తమ మార్గం. సాధారణంగా ప్రతి కిలో శరీర బరువుకు రోజుకు 0.8 గ్రాముల ప్రొటీన్ అవసరం. 50 ఏళ్లు దాటినవారికి ఈ మోతాదు 1.2 గ్రాముల వరకు ఉండాలి. జంతు ఆధారిత ఆహారాల్లో తొమ్మిది అత్యవసర అమైనో ఆమ్లాలు సమృద్ధిగా ఉంటాయి. వీటిని శరీరం సులభంగా గ్రహిస్తుంది. సోయాబీన్స్ మినహా చాలా శాకాహార పదార్థాల్లో ఒకటి లేదా రెండు అమైనో ఆమ్లాలు మాత్రమే ఉంటాయి. అయితే నిరాశ చెందాల్సిన అవసరం లేదు. సరైన ఆహార కలయికలతో పూర్తి అమైనో ఆమ్లాలను పొందవచ్చు. ఉదాహరణకు బియ్యం, గోధుమల వంటి తృణధాన్యాల్లో లైసిన్ తక్కువగా ఉంటుంది. పప్పుదినుసుల్లో మిథియోనిన్ కొరవడుతుంది. కాబట్టి మూడు వంతులు తృణధాన్యాలు, ఒక వంతు పప్పులు కలిపి తీసుకుంటే ఈ లోపాలు భర్తీ అవుతాయి. బియ్యంలో లేని లైసిన్ పప్పుల ద్వారా లభిస్తుంది. పప్పుల్లో లేని మిథియోనిన్ తృణధాన్యాల నుంచి అందుతుంది. ఈ విధంగా అన్ని అత్యవసర అమైనో ఆమ్లాలు శరీరానికి చేరి ప్రొటీన్ సమృద్ధిగా లభిస్తుంది. మితిమీరిన ప్రొటీన్ పొడుల వినియోగం దీర్ఘకాలంలో దుష్ప్రభావాలకు దారితీయొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అధిక మోతాదులో ప్రొటీన్ తీసుకుంటే కిడ్నీలపై భారం పడుతుంది. ప్రొటీన్ జీర్ణమయ్యాక మిగిలే నత్రజనిని బయటకు పంపేందుకు కిడ్నీలు ఎక్కువ పనిచేయాల్సి ఉంటుంది. ఇప్పటికే కిడ్నీ సమస్యలు ఉన్నవారికి ఇది ప్రమాదకరమవుతుంది. కాబట్టి సమతుల్య ఆహారం, సరైన కలయికలతో ప్రొటీన్ అవసరాన్ని తీర్చుకోవడం మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.



వేద న్యూస్

మంగళవారం ఏప్రిల్ 14, 2026

# 'పెద్ది' లుక్‌లో మెరిసిన రామ్ చరణ్




**వేద న్యూస్ డెస్క్:**

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మరోసారి అంతర్జాతీయ స్థాయిలో వార్తల్లో నిలిచారు. ప్రముఖ అంతర్జాతీయ పత్రిక ఎస్క్వైర్ ఇండియా తాజా సంచిక కవర్ పేజీపై ఆయన స్టైలిష్ లుక్‌లో మెరిసారు. హాంకాంగ్‌లో నిర్వహించిన ఈ ప్రత్యేక ఫోటో షూట్‌లో చరణ్ తన కొత్త అవతారంతో అభిమానులను ఆకట్టుకున్నారు. ప్రస్తుతం దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న 'పెద్ది' సినిమా కోసం రామ్ చరణ్ పెంచుకున్న కొత్త హెయిర్‌స్టైల్, గెటప్‌తోనే ఈ ఫోటోషూట్‌లో కనిపించడం విశేషం. ఈ లుక్‌లో ఆయన మరింత రగ్గడ్, స్టైలిష్‌గా కనిపిస్తూ గ్లోబల్ స్టార్ ఇమేజ్‌కు తగినట్టుగా మెప్పించారు. ఫోటోలు విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానుల్లో సంచలనం సృష్టిం చాయి. రామ్ చరణ్‌ను "ప్రస్తుత తరాన్ని ప్రభా వితం చేస్తున్న గ్లోబల్ శక్తి"గా ఎస్క్వైర్ ఇండియా ప్రశంసించింది. భారతీయ సినిమాను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని తన కథనంలో పేర్కొంది. ముఖ్యంగా ఆర్‌ఆర్‌ఆర్ తర్వాత చరణ్‌కు ప్రపంచవ్యాప్తంగా పెరిగిన గుర్తింపును ఈ కవర్ పేజీ మరింత బలపరిచిందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఫోటోషూట్ ద్వారా రామ్ చరణ్‌ను మునుపెన్నడూ చూడని సరికొత్త స్టైల్‌లో ఆవిష్కరించామని పత్రిక ప్రతినిధులు తెలిపారు. సంప్రదాయం, ఆధునికత కలగలిపిన ఈ లుక్‌లో చరణ్ వ్యక్తిత్వం మరింత హైలైట్ అయిందని పేర్కొన్నారు. మొత్తానికి 'పెద్ది' సినిమా కోసం చేసిన ఈ ట్రాన్స్‌ఫర్మేషన్‌తో పా టు, అంతర్జాతీయ మ్యాగజైన్ కవర్‌పై చోటు సంపాదించడం ద్వారా రామ్ చరణ్ మరోసారి తన గ్లోబల్ స్టార్డమ్‌ను నిరూపిం చుకున్నారు. అభిమానులు ఈ ఫోటోలపై ప్రశంసలు కురిపిస్తూ, "గ్లోబల్ స్టార్‌కు ఇదే సరైన గుర్తింపు" అంటూ సోషల్ మీడియాలో స్పందిస్తున్నారు.

# తెలుగు అబ్బాయిని పెళ్లి చేసుకో: అల్లు అరవింద్

**వేద న్యూస్ డెస్క్:**



డెకాయిట్ సినిమా విడుదలైన కొద్ది రోజుల్లోనే ప్రేక్షకుల్లో చర్చనీయాంశంగా మారింది. అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన ఈ లవ్ అండ్ యాక్షన్ థ్రిల్లర్‌కు తొలిరోజు మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్ సాధించింది. ఈ సందర్భంగా చిత్ర బృందం నిర్వహించిన విజయోత్సవ కార్యక్రమం సందడిగా జరిగింది. ఈ వేడుకకు నాగ్ అశ్విన్, నందిని రెడ్డి, అల్లు అరవింద్, బన్నీ వాసు, స్వప్న దత్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన అల్లు అరవింద్, హీరో అడివి శేష్‌పై ప్రశంసలు కురిపించారు. శేష్ మంచి కథలను ఎంచుకుంటూ ప్రేక్షకుల మనసులను గెలుచుకుంటున్నాడని, డెకాయిట్ లాంటి పాత్రలు అతనికి బాగా సరిపోతాయని అన్నారు. అలాగే ఈ సినిమా కోసం నిర్మాత సుప్రియ యార్లగడ్డ చేసిన కృషిని ప్రత్యేకంగా గుర్తుచేశారు. సినిమా గురించి మాట్లాడుతూ, ప్రేమ కథను క్రైమ్ నేపథ్యంతో మేళవిస్తూ చాలా అందంగా తెరకెక్కించారని చెప్పారు. దర్శకుడు షానిల్ డియో పనితీరును మెచ్చుకుంటూ, ఎడిటింగ్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని పేర్కొన్నారు. ఎడిటర్ పవన్ కళ్యాణ్ చేసిన పనిని కూడా ఆయన అభినందించారు. ఇక హీరోయిన్ మృణాల్ ఠాకూర్ నటనపై కూడా ప్రశంసలు గుప్పించారు. సీతారామం సినిమాలో సీత పాత్రలో మెప్పించిన ఆమె, ఈ సినిమాలో సరస్వతి పాత్రలో మరింత భావోద్వేగంతో నటించిందని అన్నారు. అయితే ఈ కార్యక్రమంలో అల్లు అరవింద్ చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలు ప్రత్యేకంగా ఆకర్షించాయి. మృణాల్ ఠాకూర్ తెలుగు అబ్బాయిని పెళ్లి చేసుకుని ఇక్కడే స్థిరపడాలని ఆశీర్వదించారు. గతంలో లావణ్య త్రిపాఠికి కూడా ఇలానే చెప్పగా, ఆమె వరుణ్ తేజ్‌ను వివాహం చేసుకున్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ వ్యాఖ్యలపై మృణాల్ సిగ్గుపడుతూ నవ్వడం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

# ఎన్టీఆర్ బీస్ట్ లుక్ వైరల్



**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కుతున్న 'డ్రాగన్' సినిమాపై అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై సినీ వర్గాల్లోనే కాకుండా ప్రేక్షకుల్లో కూడా విపరీతమైన ఆసక్తి నెలకొంది. ఇప్పుడు తాజాగా ఎన్టీఆర్ కొత్త లుక్ బయటకు రావడంతో ఈ సినిమాపై హైప్ మరింత పెరిగింది. అసామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఫొటోల్లో ఎన్టీఆర్ కండలు తిరిగిన దేహంతో అత్యంత శక్తివంతంగా కనిపిస్తూ అభిమానులను ఆకట్టుకుంటున్నారు. సన్నని నడుము, బలమైన శరీరాకృతి, కఠినమైన ముఖ భావంతో ఇచ్చిన పోజ్ చూసిన అభిమానులు ఇది ఆయన కెరీర్‌లోనే అత్యంత భిన్నమైన పాత్రగా ఉండబోతుందని భావిస్తున్నారు. ఈ పాత్ర కోసం ఎన్టీఆర్ ప్రత్యేకంగా శారీరకంగా మార్పులు చేసుకున్నారని, దీని కోసం కఠినమైన వ్యాయామాలు, నియంత్రిత ఆహార నియమాలు పాటిస్తున్నారని సమాచారం. తాను పంచుకున్న చిత్రానికి "తయారు చేసుకున్నది.. కొనుక్కోలేదు" అనే భావాన్ని వ్యక్తం చేసే వ్యాఖ్య కూడా అభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఎన్టీఆర్ లుక్‌పై అసంతృప్తి కారణంగా సినిమా షూటింగ్ ఆగిపోయిందని ప్రచారం జరిగినప్పటికీ, చిత్ర బృందం వాటిని పూర్తిగా ఖండించింది. షూటింగ్ ప్రణాళిక ప్రకారమే కొనసాగుతోందని, మధ్యలో వచ్చిన విరామం కేవలం సాంకేతిక కారణాల వల్లేనని స్పష్టం చేసింది. దర్శకుడు ప్రశాంత్ నీల్ తన సినిమాల్లో భారీ యాక్షన్ సన్నివేశాలను అత్యంత నాణ్యతతో తెరకెక్కించేందుకు ప్రతి షెడ్యూల్ మధ్య గ్యాప్ తీసుకోవడం సాధారణ విషయమేనని తెలిపింది. ఇప్పటికే విదేశీ ప్రదేశాల్లో ఒక ప్రధాన షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసిన చిత్ర బృందం, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కీలక యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించినట్లు సమాచారం. ముఖ్యంగా భారీ ఫైట్స్, ఛేజ్ సన్నివేశాల కోసం ప్రత్యేక సెట్లు సిద్ధం చేస్తున్నారని తెలుస్తోంది. తదుపరి షెడ్యూల్‌లో మరింత భారీ యాక్షన్ ఎపిసోడ్‌లు చిత్రీకరించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ సినిమాలో ఎన్టీఆర్ ఇప్పటివరకు ఎప్పుడూ కనిపించని రగ్గడ్, మాస్ లుక్‌లో కనిపించనున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఆయన పాత్రలో తీవ్రత, భావోద్వేగం, యాక్షన్ మేళవింపుతో కొత్త కోణాన్ని చూపించబోతున్నారని అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే కారణంగా ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో భారీ విజయాన్ని సాధించే అవకాశముందని అభిమానులు నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ చిత్రంలోని ప్రతినాయకుడి పాత్రపై కూడా ప్రస్తుతం ఆసక్తికర చర్చ కొనసాగుతోంది. తొలుత టోవినో థామస్ పేరు వినిపించినప్పటికీ, తేదీల సమస్యల కారణంగా ఆయన ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆ కీలక పాత్ర కోసం షాహిద్ కపూర్‌ను సంప్రదించే ఆలోచనలో చిత్ర బృందం ఉన్నట్లు తెలుస్తోంది. హీరోకు ధీటుగా నిలిచే బలమైన ప్రతినాయకుడిగా ఆయన ఎంపిక అయితే సినిమా స్థాయి మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. ఈ భారీ యాక్షన్ కథలో హీరోయిన్‌గా రుక్మిణి వసంత్ నటిస్తుండగా, ఇతర ప్రముఖ నటులు కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం, సాంకేతిక విభాగాలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని సమాచారం. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం 2026 చివరలో లేదా 2027 ప్రారంభంలో ప్రపంచవ్యాప్తంగా విడుదలయ్యే అవకాశముందని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. మొత్తానికి ఎన్టీఆర్ కొత్త లుక్, దర్శకుడి స్టైల్, కథలోని భారీ యాక్షన్ అంశాలు కలిపి 'డ్రాగన్' సినిమాను అత్యంత ఆసక్తికర ప్రాజెక్ట్‌గా మార్చాయి. విడుదలకు ముందే ఈ స్థాయిలో చర్చనీయాంశంగా మారిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాలి.

# వేసవిలో అదృష్ట పరీక్షకు మృణాల్, పూజా రెడీ

**వేద న్యూస్ డెస్క్:**




సినీ రంగంలో ఎప్పుడూ అంచనాలు పెట్టుకున్న సినిమాలు సక్సెస్ కాకపోవడం, అనూహ్యంగా ఇతర ప్రాజెక్టులు కెరీర్‌ను మలుపుతిప్పడం సహజమే. ప్రస్తుతం ఇదే పరిస్థితి హీరోయిన్లు పూజా హెగ్డే, మృణాల్ ఠాకూర్ల విషయంలో కనిపిస్తోంది. ఈ వేసవిలో బాలీవుడ్ ప్రాజెక్ట్‌తో వీరిద్దరూ తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. 'రెట్రో' తర్వాత మంచి ప్రాజెక్ట్ కోసం ఎదురుచూస్తున్న పూజా హెగ్డే, ఈ ఏడాది 'జననాయకన్'తో శుభారంభం అవుతుందని భావించారు. అయితే సెన్సార్ సమస్యలు, లీకుల కారణంగా ఆ సినిమా విడుదలపై అనిశ్చితి నెలకొనడంతో, ప్రస్తుతం ఆమె పూర్తి దృష్టి బాలీవుడ్ చిత్రం 'హై జవానీతో ఇష్క్ హోనా హై'పై పడింది. ఈ సినిమాలో వరుణ్ ధావన్ హీరోగా నటిస్తున్నారు. ముందుగా జూన్ 12న విడుదల చేయాలని భావించిన ఈ చిత్రాన్ని మే 22కే ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. దీంతో సమ్మర్ సీజన్‌లోనే పూజా ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమవుతోంది. ఇక అదే చిత్రంలో మరో హీరోయిన్‌గా నటిస్తున్న మృణాల్ ఠాకూర్ ఇప్పటికే ఈ సమ్మర్‌లో 'డెకాయిట్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. సినిమాకు మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, తొలి రోజు కలెక్షన్లు మాత్రం బాగానే వచ్చినట్లు చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా మృణాల్ చేసిన పెర్ఫార్మెన్స్ ఓరియెంటెడ్ పాత్రకు మంచి పేరు రావడం ఆమెకు ప్లస్‌గా మారింది. అలాగే భవిష్యత్తులో అల్లు అర్జున్తో కలిసి నటించే అవకాశం ఉందనే టాక్ కూడా ఇండస్ట్రీలో వినిపిస్తోంది. ఆ అవకాశం కోసం తాను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని మృణాల్ తెలిపినట్లు సమాచారం. మరోవైపు 'హై జవానీతో ఇష్క్ హోనా హై' సినిమా విడుదల కోసం కూడా ఆమె ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మొత్తానికి ఈ వేసవిలో బాలీవుడ్ చిత్రం ద్వారా పూజా, మృణాల్ ఇద్దరూ తమ కెరీర్‌కు కొత్త ఊపు తీసుకురావాలని భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఈ సినిమా వారికి ఎంతవరకు సక్సెస్ తీసుకొస్తుందో చూడాలి.

# గోపీచంద్ 'భరతవర్ష' గ్లింప్స్ విడుదల



**వేద న్యూస్ డెస్క్:**

యాక్షన్ హీరో గోపీచంద్ మరో భారీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. వరుస పరాజయాల తర్వాత ఘన విజయం కోసం ఎదురుచూస్తున్న ఆయన ఈసారి పూర్తిగా భిన్నమైన కథతో 'భరతవర్ష' అనే శక్తివంతమైన శీర్షికతో కొత్త చిత్రాన్ని ప్రకటించారు. టైటిల్ గ్లింప్స్ విడుదలైన వెంటనే ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా విడుదలైన గ్లింప్స్‌లో గోపీచంద్ యోధుడిగా కనిపిస్తూ అభిమానులను ఆకట్టుకున్నారు. శత్రువులను ధైర్యంగా ఎదుర్కొంటూ యుద్ధరంగంలో విరుచుకుపడే సన్నివేశాలు రోమాలు నిక్కబొడు చుకునేలా ఉన్నాయి. అద్భుతమైన దృశ్యాలు, నేపథ్య సంగీతం, యాక్షన్ అంశాలు అన్నీ కలిసివచ్చి ఈ సినిమా భారీ స్థాయిలో రూపొందుతున్నట్లు సంకేతాలు ఇస్తున్నాయి. 'భరతవర్ష' అనే పేరుకు కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. పురాణాల ప్రకారం హిమాలయాల నుంచి సముద్రం వరకు విస్తరించిన అఖండ భారతాన్ని సూచించే పేరే భరతవర్షం. చక్రవర్తి భరతుడి పేరుమీదుగా ఈ పేరు వచ్చినట్లు చెబుతారు. ఈ నేపథ్యంలో ఈ చిత్రం దేశభక్తి, చరిత్ర, పురాణ అంశాలను మేళవించిన పీరియాడికల్ యాక్షన్ కథగా రూపొందుతున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో గోపీచంద్ సరసన రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఆమె పాత్ర కూడా కథలో కీలకంగా ఉండబోతుందని తెలుస్తోంది. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ఈ సినిమాను నిర్మిస్తున్న మేకర్స్ ఎక్కడా రాజీ పడటం లేదని సినీ వర్గాలు చెబుతున్నాయి. గోపీచంద్ కెరీర్‌లో ఇది కీలక మలుపు కావొచ్చనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. త్వరలోనే విడుదల తేదీపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

# చీరలో కట్టిపడేసిన ఐశ్వర్య రాజేష్ అందం

**వేద న్యూస్ డెస్క్:**



టాలీవుడ్, కోలీవుడ్ ప్రేక్షకులకు తన సహజ నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి ఐశ్వర్య రాజేష్ మరోసారి తన అందంతో సోషల్ మీడియాను షేక్ చేసింది. గ్లామర్ కంటే పాత్రకు ప్రాధాన్యతనిచ్చే ఈ భామ, సినిమాల్లోనే కాకుండా సోషల్ మీడియాలోనూ తనకంటూ ప్రత్యేక ఫాలోయింగ్‌ను ఏర్పరుచుకుంది. తాజాగా నెమలి రంగు చీరలో ఆమె పంచుకున్న ఫోటోలు నెట్టింట వైరల్ అవుతూ అభిమానులను ఆకట్టుకుంటు న్నాయి. సాంప్రదాయ దుస్తుల్లో సొగసుతో మెరిసిపోతూ, ఎలిగెన్స్‌కు నిదర్శనంగా నిలిచింది. మినిమల్ మేకప్, క్లాసిక్ జ్యువెలరీతో కనిపించిన ఆమె లుక్‌కు నెటిజన్లు ఫిదా అవుతున్నారు. ముఖ్యంగా చీరలో ఆమె ప్రెజెన్స్, నేచురల్ ఎక్స్‌ప్రెషన్స్ ఫోటోలకు మరింత అందాన్ని తెచ్చాయి. ఇటీవల వరుసగా కంటెంట్ ఉన్న సినిమాలను ఎంచుకుంటూ ప్రేక్షకుల మన్ననలు పొందుతున్న ఐశ్వర్య రాజేష్, అదే సమయంలో సోషల్ మీడియాలో కూడా యాక్టివ్‌గా ఉంటూ తన అభిమానులతో ఎప్పటికప్పుడు కొత్త అప్డేట్స్ పంచుకుంటోంది. ఈ ఫోటోలు కూడా ఆమె స్టైల్, క్లాస్‌ను మరోసారి నిరూపించాయి. నెమలి రంగు చీరలో ఆమె అందం, ఆత్మవిశ్వాసం కలిసిపోవడంతో ఈ ఫోటోలు అభిమానుల హృదయాలను దోచేస్తున్నాయి. ఇక అభిమానులు ఈ ఫోటోలపై కామెంట్ల వర్షం కురిపిస్తూ "సింపుల్‌గా ఉండి ఇంత అందంగా ఎలా కనిపిస్తారు?", "చీరలో మీరు సూపర్" అంటూ ప్రశంసలు వెల్లువెత్తిస్తున్నారు. కొందరు అయితే ఆమెను "నేచురల్ బ్యూటీ" అంటూ కొనియాడుతున్నారు. మొత్తానికి, ఒకే ఫోటోషూట్‌తో సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లోకి వచ్చిన ఐశ్వర్య రాజేష్ మరోసారి తన ఆకర్షణతో అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073